

# మెహెర్‌బాబా

అవతార్ మెహెర్‌బాబాకే అంకితమైన మాసపత్రిక

సంపుటి :12  సంచిక: 12  హైదరాబాద్  2013 ఏప్రిల్  పేజీలు 40

Please visit : www.srimeherbaba.com  వార్షిక సభ్యత్వం : రూ.100/-

# మెహెర్‌స్థాన్ ధర్మశాల 8వ వార్షికోత్సవం

మెహెర్‌స్థాన్ ధర్మశాల 8వ వార్షికోత్సవం 2013 జూలై 28, ఆదివారం ఉదయం 7.30 నుండి సాయంత్రం 5.30 వరకు నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి శ్రీ వై.ఎస్. రావు (98481 11671) ఒక ప్రకటనలో తెలిపారు. మెహెరాబాద్ నుండి శ్రీ మెహెర్‌నాథ్ కల్చూరీ తదితరు బాబా ప్రేమికులు విచ్చేస్తున్నారని ఆయనన్నారు. స్థానికంగా గల బాబా ప్రేమికులందరు విచ్చేసి ఈ కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా ఆయన కోరారు.

# జోగిపేట సెంటర్ 20వ వార్షికోత్సవము

అవతార్ మెహెర్‌బాబా జోగిపేట సెంటర్, మెదక్ జిల్లా 20వ వార్షికోత్సవము 19.05.2013 ఆదివారము రోజున నిర్వహించనున్నట్లు శ్రీ వెంకటేశ్వర్లు తెలిపారు. బాబా ప్రేమికులందరు విచ్చేసి ఈ కార్యక్రమములో పాల్గొనాల్సిందిగా ఆయన కోరారు.

# ఖమ్మం బాబా ఛారిటబుల్ ట్రస్టు

అవతార్ మెహెర్‌బాబా సెంటర్ ఖమ్మం ఛారిటబుల్ ట్రస్టు సర్వసభ్య సమావేశము 23.03.2013న జరిగినది. ఈ క్రింది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవముగా ఎన్నుకొనిరి.

**అధ్యక్షులు:** శ్రీ ఆర్. రామచంద్రయ్య, **ఉపాధ్యక్షులు:** శ్రీ ఎల్. వెంకయ్య
**కార్యదర్శి:** శ్రీ ఎన్. రామన్న , **ఉపకార్యదర్శి:** శ్రీమతి ఆర్. ఉమాదేవి
**కోశాధికారి:** శ్రీ యం. సింహారెడ్డి ఎన్నికయ్యారు.

# పార్వతీపురం బాబా సెంటర్

విజయనగరం జిల్లా పార్వతీపురం శ్రీ అవతార్ మెహెర్‌బాబా కేంద్రం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకొనబడిరి.

| | |
|---|---|
| **గౌరవాధ్యక్షులు:** | సో॥ పసుమర్తి గురునాధరావు |
| **అధ్యక్షులు:** | డా॥ మంచిపల్లి శ్రీరాములు |
| **కార్యదర్శి:** | సో॥ ఆబోతులు త్రినాధం |
| కోశాధికారి: | సో॥ సాధనాల సూర్యనారాయణ |
| ఉపకోశాధికారి: | సో॥ లాడి బాలకృష్ణారావు |
| ఉపాధ్యక్షులు: | సో॥ బెహరా వెంకటరావు, సోదరి. లాడె జ్యోత్స్న |
| ఉపకార్యదర్శి: | సోదరి. లచ్చిరెడ్డి ఉదయ కుమారి, సో॥ రామకృష్ణారావు |
| ప్రత్యేక సలహాదారులు: | సో॥ బొండపల్లి అప్పలస్వామి |




**గౌరవ సంపాదకులు**
**మల్లాది కృష్ణానంద్**
**99595-53218,**
**krishnanandm@yahoo.com**
**malladisukku@gmail.com**

**వ్యవస్థాపకులు:**
**దశిక ప్రసాదరావు**
**040-65699611**

## లోపలి పేజీలలో...

1. సంపాదకీయం 5
2. బ్రహ్మైక్యం భూమ్మీదనే సాధ్యం 6-12
3. డా॥ ఘనీతో మా జ్ఞాపకాలు 13-18
4. ఉత్తర కాశీ... 19
5. లార్డ్ మెహెర్ 20-26
6. సంవాదం 27-29
7. మెహెర్‌బాబా కార్యక్రమాలు 30-33
8. ఇది కథ కాదు. ఐనప్పటికీ., 34-36
9. గుర్తుంచుకోండి!! 37

**ముఖచిత్రం**
**మస్తుల సాంగత్యంలో...**

**ఉత్తర ప్రత్యుత్తరాలకు**
ఎడిటర్,
మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్, యాప్రాల్,
ప్లాట్ నెం. 32,
జె.జె. నగర్‌కాలనీ ,
సికింద్రాబాద్-500 087
ఫోన్: 99595-53218

## మనవి

**మీ వ్యాసాలు, లేఖలు ఇతర సమాచారం మాకు ప్రతినెల 4వ తేదీ లోపల అందేలా పంపవలసింది. పత్రికను ప్రతినెల 19 లేదా 20వ తేదీలలో పోస్టు చేస్తున్నాం. 25వ తేదీలోగా పత్రిక మీ ముంగిట ఉంటుంది.**

Please visit : www.srimeherbaba.com

# గుంటూరు మెహెర్ బాబా సెంటర్
## స్వర్ణోత్సవాలు 2014 మార్చి 1,2 తేదీలలో

గుంటూరు మెహెర్‌బాబా సెంటర్ స్వర్ణోత్సవాలు 2014 మార్చి 1, 2 తేదీలలో పెద్ద ఎత్తున జరపాలని ప్రతిపాదించినట్లు కార్యనిర్వాహకులు శ్రీ కనకయ్య తదితర సభ్యులు తెలిపారు. 1954 ఫిబ్రవరిలో రెండవసారి ఆంధ్రా పర్యటనకు వచ్చిన సందర్భంలో మెహెర్‌బాబా గుంటూరు విచ్చేసారు. మెహెర్‌బాబా ఫిబ్రవరి 24 రాత్రి 9.15 ప్రాంతంలో విజయవాడ నుండి గుంటూరు వచ్చారు. స్థానిక పెద్దలు శ్రీ మద్ది సుదర్శనం మెహెర్‌బాబాకు ఆతిథ్యం ఇచ్చారు. విజయవాడలోని బాబా ప్రేమికులు శ్రీ మాజేటి రామ్మోహనరావు గారికి స్వయాన బావమరిది శ్రీ మద్ది సుదర్శనం. గుంటూరు నియోజకవర్గం నుండి కొంతకాలం ఆయన పార్లమెంటు సభ్యునిగా కూడా వున్నారు. ఫిబ్రవరి 25న బాబా గుంటూరులో పెద్ద ఎత్తున ప్రజాదర్శనం ఇచ్చారు. ఆనాడు 5,000 మందికి పైగా స్థానికులు బాబా దర్శనం చేసుకున్నారు. ఆయన చేతుల మీదుగా ప్రసాదం అందుకున్నారు. ప్రజాదర్శన కార్యక్రంలో మండలి సభ్యుడైన రమ్జూ అబ్దుల్లాచే ముందుగా రాయించి వుంచిన బాబా సందేశాన్ని చదివించారు. ఈ సందేశంలో మెహెర్‌బాబా "మనమందరం ఒక్కటే అన్నారు. ప్రతి ఒక్కనిలో భగవంతుడున్నాడు. ఐనప్పటికీ మానవుని అజ్ఞానం వల్ల అది తెలుసుకోలేకపోతున్నాడని ఆ సందేశంలో పేర్కొన్నారు. పేద- ధనిక, చిన్నా - పెద్ద అనే తారతమ్యం లేకుండా అందరూ తనను ప్రేమించవచ్చన్నారు. అదేమాదిరిగా తోటివారికి నిస్వార్థసేవ అందజేయడం ద్వారా కూడా తనను ప్రేమించినట్లేనని బాబా అన్నారు.

**You can also love Me by rendering selfless service to humanity. The term "Selfless Service" has been so commonly used that the purpose is lost in the very mentioning of it. You serve others only when you do it even at the cost of your own happiness, and in your mind even the thought of having served does not exist.**

అదే రోజున బాబా ఉదయం అరండల్‌పేటలోని సాయిబాబా దేవాలయ నిర్మాణ శంఖుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆ దరిమలా బాబా తన తిరుగు ప్రయాణంలో గుంటూరు పట్టణంలో వున్న శ్రీరామ క్షేత్రం, ఓంకార క్షేత్రాలను సందర్శించి సాయంత్రానికి విజయవాడ చేరుకున్నారు. మెహెర్‌బాబా గుంటూరును సందర్శించిన దశాబ్ద కాలానికి, మార్చి 1, 1964లో బాబా ప్రేమికులు శ్రీ ఎన్.వి.రమణయ్య గుంటూరు బాబా సెంటర్‌ను నెలకొల్పారు. అనంతరం విజయవాడ-గుంటూరు జాతీయ రహదారిలో అవతార్ మెహెర్‌బాబా సెంటర్ భవనాన్ని నిర్మించారు. అవతారుని పాదస్పర్శతో పునీతమైన ప్రాంతంగా స్వర్ణోత్సవ వేడుకలు 2014 మార్చి 1,2 తేదీలలో జరుపుకోనున్నామని శ్రీ కనకయ్య తెలిపారు.

సంపాదకీయం

# ఏల ఆలస్యం!!

ఈ జీవితంతో విసిగిపోతున్నామని, కష్టాల కడలిలో వున్నామని,
ఎన్నడూ అనుకోవద్దన్నారు – మెహెర్‌బాబా.
ప్రతిఒక్కరూ అనుక్షణం ఆనందంగా వుండమన్నారు.
ఆనందంగా ఎలా వుండాలో తెలియని తికమకవల్లే ఆనందంగా
వుండలేకపోతున్నారని బాబా ఒక సందర్భంలో అన్నారు.
జీవితం చాలా అందమైంది. తనివితీరా ఆనందంగా ప్రతీ క్షణం గడపండి.
ఇది లేదు – అది లేదని చింతించకండని
మెహెర్‌బాబా తన ప్రేమికులను అనేకమార్లు హెచ్చరించారు.
Try to be always happy.
Never think that life is dreadful.
I am tired of life.
Such thoughts really make life misearable.
ఈ ప్రపంచంలో అన్నింటినీ ఆస్వాదిస్తూ అన్నింటికీ సమదూరంలో
వుండడం అలవరచుకోవాలన్నది బాబావారి సందేశం.
One has only to adopt that life which keeps materialism and spirituality in balance!

**ఇదెలా సాధ్యం?**

మనస్సు తపీమని ప్రశ్నిస్తుంది.
ప్రతిరోజూ నీ విధులన్నింటికీ హాజరవుతూ, ప్రాపంచికంగా
నీ పనులన్నింటినీ చక్కబెడుతూనే, కొంతలో కొంత సమయాన్ని,
కొన్ని క్షణాలైనా సరే....భగవధ్యానం కోసం, భగవన్నామస్మరణ కోసం,
భగవరాధాన కోసం కేటాయించడం అలవరుచుకోమన్నారు మెహెర్‌బాబా.
భగవధ్యాసలో ఈ కొద్దిపాటి క్షణాలే మీకు తెలియకుండానే క్రమేణా పెరుగుతాయని,
ఆనందంగా గడపడం అలవరుచుకోగల్గుతారని బాబా అన్నారు.
క్రమేణా ప్రాపంచక భవబంధనాల నుండి బయటపడగల్గుతారని బాబా అన్నారు.
ఆధ్యాత్మికంగా నా సహాయం ఎల్లవేళలా వుంటుందని బాబా భరోసా ఇచ్చారు!!
ప్రయత్నించండన్నారు !!
ఇక ఏల ఆలస్యం!!

❀

# బ్రహ్మైక్యం భూమ్మీదనే సాధ్యం

1962 నవంబరు 2 ఉదయం 9 గంటల ప్రాంతంలో గురుప్రసాద్ హాలులో
బాబా చుట్టూతా కూర్చున్నాం.
మమ్ముల్ని బాబా కుశల ప్రశ్నలు అడిగారు.
అంతకుముందు రోజున పెద్ద వాన కురిసింది.

వానలో బాగా తడిశారు కదా! జలుబు చేశిందా? అని బాబా అడిగారని ప్రాక్-పశ్చిమ సమావేశాల్లో పాల్గొన్న ఒక అమెరికన్ ప్రేమికుడు ఆనాడు తమతో బాబా జరిపిన సంభాషణను గ్రంధస్తం చేశారు. అత్యంత ఆసక్తికర ఆ ఆధ్యాత్మిక విషయాలు ఇలా వున్నాయి. దయచేసి పరిశీలించండి.

ఇలా కబుర్లలో ఉండగానే ఆస్ట్రేలియన్ బాబా ప్రేమికుడు,
ప్రముఖ కవి పండితుడు ఫ్రాన్సిస్ బ్రాబజాన్ ఒక పెద్ద చార్టు
తీసుకొచ్చి గోడకు వ్రేలాడదీసాడు.
బాబా దానిని చూపిస్తూ –
**"The chart of four journeys"** అని వివరించారు.
అందరికీ కనబడుతోందా? అని బాబా తిరిగి తన సంజ్ఞలతో ప్రశ్నించారు.
ఎంతో కష్టమైన ఆధ్యాత్మిక విషయాల్ని చాలా సూక్ష్మంగా
ఈ చార్టులో వివరించడమైందన్నారు బాబా.
మీరంతా చదువుకున్న వాళ్ళు.
సూక్ష్మంగా వున్న చిన్న చిన్న విషయాల్ని కూడా చాలా కఠినంగా,
కష్టంగా మార్చివేశారని బాబా అన్నారు.
మీరు అమెరికా, ఆస్ట్రేలియా, ఇంగ్లాండు, యూరోపుల నుండి భారతదేశానికి వచ్చారు.
కొందరు ఒక ప్రదేశం నుండి మరో ప్రదేశానికి లేదా చంద్రుని దగ్గరకో,
కుజ, అంగారక గ్రహాల దగ్గరకో ప్రయాణం చేస్తారు.
ఈ ప్రయాణం బహిర్గత ప్రయాణం. (External Journey).
ఈ చార్టు ద్వారా నేను చెప్పబోయేది
అంతర్గత ప్రయాణం గురించి అని బాబా అన్నారు.
ముందుగా రెండు ప్రధాన విషయాలు తెలుసుకోవాలి.
అదేమంటే భగవంతుడు అనంతుడు (GOD is Infinite).
ఆయన నీడ కూడా అనంతమైంది (His shadow also is infinite).
ఈ వివరణను చార్టులోని సన్నని గీతలు ద్వారా చూపించడమైంది.


CHART VI
THE FOUR JOURNEYS
INFINITE GOD
INFINITE GOD
THE REALITY
FOURTH JOURNEY
PASSING-AWAY AS GOD
(God drops His physical, subtle and mental vehicles and experiences Infinite Power, Knowledge and Bliss while retaining Infinite Individuality.)
LIVING GOD'S LIFE
(Living both as Man and God simultaneously.)
QUTUBIYAT – Which only the five Perfect Masters accomplish.
(As man and God, experiences Infinite Power, Knowledge and Bliss and uses them.)
THIRD JOURNEY
ABIDING IN GOD
(Being God.)
BAQA – Which very, very few persons go on to.
(As man and God, experiences Infinite Power, Knowledge and Bliss.)
SECOND JOURNEY
PASSING-AWAY INTO GOD
(Becoming God.)
7th Plane – FANA – Very few persons arrive here at end of First Journey.
(As God, experiences Infinite Power, Knowledge and Bliss.)
FIRST JOURNEY
MENTAL WORLD
6th
5th
4th
SUBTLE WORLD
3rd
2nd
1st
ILLUSION
Planes – On which few persons embark.
GROSS WORLD
OUR EARTH
Throughout which are some planets which contain the Seven Kingdoms of Evolution.
From the most finite point in and of the Infinite comes out the infinite Gross Sphere.
INFINITE GROSS SPHERE
INFINITE GOD
INFINITE GOD

గమనించండన్నారు.

అనంతుడైన భగవంతుడు ఆయన ఛాయ పరిధిలోనే

అనంతమైన స్థూల ప్రపంచం (Gross sphere) ఉందని బాబా సూచించారు.

భగవంతునికి పరిమితులు లేవు.

ఆయన అపరిమితుడు (God is boundless & limitless).

ఈ అపరిమితమైన ఛాయాపూరిత స్థూల ప్రపంచంలో,

అసంఖ్యాకంగా, లెక్కకు మిక్కిలిగా ఎన్నో విశ్వాలు, విశ్వాంతరాళ్ళు ఉన్నాయి.

కొన్ని విశ్వాలలో (Galaxies) మానవాళి నివసిస్తోంది.

మరికొన్ని విశ్వాలలో ఆవాసయోగ్యత లేదు.

కొన్ని లక్షల సంఖ్యలో నక్షత్రాలు, సూర్య చంద్రాదులు

ఈ అనంత ఛాయా పూరిత స్థూల ప్రపంచంలో వున్నాయని బాబా వివరించారు.

ఐతే, వీటన్నింటిలో కూడా మనం నివసిస్తున్న ఈ భూమికి ఒక ప్రత్యేకత వుందని బాబా అన్నారు.

(..but of all these non-habitable and habitable worlds, this earth has a special position. It is the only place where the experiences of the subtle and mental worlds can be had by human beings. Only on this earth can a man realize God. --Lord Meher Vol. VIII Page. 4291)

ఈ భూమ్మీద మాత్రమే మానవులు

సూక్ష్మ, మానసిక ప్రపంచాలను (Subtle and Mental) అనుభవించగలరని

బాబా స్పష్టం చేశారు.

అంతేకాదు ఈ భూమ్మీద నివసిస్తున్న మానవాళికి మాత్రమే భగవత్ సాక్షాత్కారం,

భగవదైక్యం, బ్రహ్మైక్య సాధన సాధ్యమౌతుందని మెహెర్‌బాబా స్పష్టంగా పేర్కొన్నారు.

**సూక్ష్మ ప్రపంచం:-**

సూక్ష్మ ప్రపంచం ఎక్కడ? ఎలా? వుంటుంది అంటే, అవెక్కడో లేవని

బాబా చెబుతూ, అవి నీలోనే వున్నాయన్నారు.

బాహ్యంగా మన కంటికి కనబడేవికావివి అని అన్నారు.

సూక్ష్మ ప్రపంచానికి ప్రయాణం అంటే అది నీలో నీవు చేసే

అంతర్గత ప్రయాణం (It is journey within) అని బాబా అన్నారు.

మీరు చూస్తున్న ఈ బాహ్య ప్రపంచం, ఈ అందచందాలు కానీ,

అందవికారం కానీ అంతా నిజం కాదు.

వాస్తవం కాదు. ఇదంతా మిధ్య.

ఎందుకూ కొరగానిది అని బాబా స్పష్టం చేశారు.

బాహ్యంగా మనం చూస్తున్న ఈ అనంతమైన స్థూల ప్రపంచమంతా
మిధ్యయే అని బాబా తిరిగి అన్నారు.
దీనికి ఏ మాత్రం విలువలేదు.
ఐతే, ఈ పుడమి తల్లి పవిత్రమైనది.
ఈ భూమ్మీద మీరు నివసిస్తూ, ఇక్కడ వుంటూనే నీలో నీవు
**అంతర్గత ప్రయాణం** చేయడమనేది అత్యంత ప్రధానమయింది.
ఈ భూమి మీద నివసిస్తున్న ఎందరో ఆధ్యాత్మిక చింతనాపరులు
తమ అంతర్గత ప్రయాణం ద్వారా
సూక్ష్మ ప్రపంచ అనుభవాన్ని అనుభవించగల్గుతున్నారు.

ఇలా అంతర్గత ప్రయాణం చేసే ఆధ్యాత్మిక చింతనాపరులు ఎక్కడివారక్కడే వుంటారు. అలా ఉంటూనే ఒక విశేష అనుభూతిని అనుభవిస్తారు. అంటే ఈ అనుభూతి కోసం వారు ఎక్కడో హిమాలయాలలోని మంచుకొండల దగ్గరకు వెళ్ళవల్సిన పనిలేదని బాబా స్పష్టంచేశారు. (For the one who journeys within, everything remains as it is; his experiences are of a different nature).

బాబా ఇంకోమాట చెప్పారు.

ఎప్పుడైతే సూక్ష్మ ప్రపంచంలో అడుగిడి, అక్కడి ప్రశాంతతను, విశేష అనుభూతిని చవిచూస్తారో ఇక వారికి బాహ్యంగా వున్న ఈ స్థూల ప్రపంచం, ఈ స్థూల ప్రపంచం తాలూకు అనుబంధం, అనుభూతులు ఏమీ వుండవు.

సూక్ష్మ ప్రపంచంలోనే అతను తన ఆనందాన్ని వెతుక్కుంటాడు.

## మానసిక ప్రపంచం

ఈ అంతర్గత ప్రయాణం ఇలాగే మరికొంత సమయం కొనసాగితే ఆ ప్రయాణికుడి అనిర్వచనీయమైన అనుభూతి మరింత బలపడి, మానసిక ప్రపంచంలోనికి అడుగిడతాడు.

మానసిక ప్రపంచంలో అతనుండే సమయంలో తన ఎదురుగా వున్నవారిని గమనించగల్గుతాడు. వారివారి మనస్సుల్లోని భావాలను పసిగట్టగల్గుతాడు. ఎదుటివారు ఏమి ఆలోచిస్తున్నారు, ఎవరి గురించి చింతిస్తున్నారు, ఇత్యాది విషయాలు అతనికి అవలీలగా అవగతమౌతాయి.

ఈ స్థితిని దాటి ముందుకు ప్రయాణిస్తే, అతడు తనలోనే వున్న భగవంతుడిని దర్శించగల్గుతాడు. అన్నింటా, అందరిలోనూ భగవంతుడిని దర్శించగల్గుతాడని బాబా అన్నారు.

ఈ మానసిక ప్రపంచంలో వుండగానే ఈ ఆధ్యాత్మిక బాటసారి తనకూ – భగవంతునికీ మధ్య ఒక పెద్ద అగాధం (Sees an abyss, gulf) వున్నట్లు గమనిస్తాడు.

ఈ స్థితిలో అతనికి భగవదర్శనం కల్గుతుంది కానీ భగవదైక్యం సాధ్యం కాదు.
ఆ బాటసారి భగవదైక్యం కోసం పరితపిస్తాడు.
భగవదైక్యం కోసం చకోర పక్షిలా ఎదురుతెన్నులు చూడవల్సివస్తుంది.
ఈ బాటసారి తన అంతర్ముఖ ప్రయాణాన్ని మరింత తీవ్రంగా ముందుకు సాగిస్తే,
భగవంతునికీ–బాటసారికీ మధ్యన వున్న మాయ తొలగిపోతుంది.
ఆ మాయ తొలగినప్పుడు, భగవంతుడొక్కడే అనే అనుభవం కలుగుతుంది.
ఈ ప్రపంచం, తాను చూస్తున్న ఈ విశ్వం అంతా
ఒక భ్రాంతి అని ఆతనికి తేటతెల్లమౌతుంది.
అనంతజ్ఞాన సంపన్నుడైన భగవంతుడి శక్తిని, దయను అనుభవిస్తాడు.
He knows there was no space, no worlds, no universe,
it was all just a shadow play ‘ He experiences GOD ALONE IS.
కానీ, అతడు ఆ జ్ఞానాన్ని, శక్తిని ఇతరులకోసం కానీ,
ఇతర విషయాల కోసం కానీ వినియోగించ రాదు.
చివరిగా బాబా ఏమన్నారంటే,
ఈ అంతర్గత ప్రయాణం ప్రారంభించడమే చాలా కష్టం.
ఒకసారి ఈ ప్రయాణం మొదలయితే సాధారణంగా చురుకుగా ముందుకు సాగుతుంది.
మనం ఒక దేశం నుండి మరో దేశానికి, లేదా ఒక గ్రహ ఉపరితలం నుండి
మరో గ్రహానికి, ఇలా ఎంత దూరమైనా ప్రయాణించి లక్ష్యాన్ని
చేరుకోవడం చాలా సుళువైన పని.
కానీ, ఈ అంతర్గత ప్రయాణం (Inward journey)
అంత తేలికైన పని కాదన్నారు.
చాలా కొద్దిమంది మాత్రమే ఈ ప్రయాణంలో కడపటిదైన
ఏడవ భూమికను చేరుకో గల్గుతారన్నారు.
బాబా ఆ చార్టు చూపిస్తూ అంతర్గత ప్రయాణం గురించి వివరిస్తూ,

## హాఁ(...చెప్పండి

నేను చెప్పిందేమైనా తలకెక్కిందా? అని అడిగారు.
సరే... అర్థం కాకపోయినా వచ్చే నష్టం ఏమీ లేదన్నారు.
దాని గురించి బుర్ర బద్దలకొట్టుకోవద్దన్నారు.
అవతారుని సమక్షంలో వున్న మీ అందరికీ,
అవతారుని కాలంలో వున్న వారందరూ అంచలంచెలుగా వున్న
ఈ అంతర్గత ప్రయాణం గురించి ఆలోచించాల్సినంత పన్లేదని బాబా భరోసా ఇచ్చారు.

అవతారుని Grace? మీ మీద వుంటే,
మీరు ఎక్కడ వున్నా, మిమ్ముల్ని ఎక్కడికి తీసుకెళ్ళేందుకు మీరు అర్హులో అక్కడికి,
ఈ రైళ్ళూ, విమానాలు అవసరం లేకుండానే
క్షణకాలంలో అవతారుడు తీసుకెళ్ళిపోతాడు.
మీకు భయమేల అని బాబా హామీ ఇచ్చారు.
ఇదంతా మీ కోసం కాదు.
రాబోయే తరాలవారి కోసమంటూ బాబా చిరునవ్వులతో అన్నారు.
కేవలం నా పట్ల విధేయతతో వుండండి.
అది చాలన్నారు బాబా.
నన్ను ప్రేమించండి!!
నా కొంగును జారవిడవకండి!
అంతమాత్రం మీరు చేయగల్గితే, నేనెక్కడ వుంటే మీరూ నాతోనే వుంటారు.
మీరు Inward journey చేయాలనుకుంటే కూడా మీరు నాతోనే వుంటారన్నారు.
ఎందుకంటే,
నేను ఆ ప్రయాణంలోనూ వున్నాను కదా అన్నారు.
మీరు చూస్తున్నదంతా మిధ్య. ల
భగవంతుడొక్కడే సత్యం.
You must love god, see god & become one with god.
That is your duty.
ఇదంతా మిధ్య అని తెలుసుకోవడం మీ విధి.
భగవంతుడిని ప్రేమించాలంటే కూడా అది మీ చేతుల్లో ఏమీ లేదు.
But to love god is also not in your hands.
It is a gift from god to you.

## 18 వేల ప్రపంచాలలో మానవాళి

కొన్ని వేల విశ్వాలు వున్నాయన్నాను కదా!!
అవి ఎన్నివున్నాయో చెప్పనలవి కాదు.
నేను చెప్పిన ఈ విషయాన్ని శాస్త్రజ్ఞులు త్వరలో కనుగొంటారు.
18 వేల ప్రపంచాలలో మానవాళి నివసిస్తోంది.
వీటిల్లో నివసించే కొంతమంది మానవులకు అసమానమైన తెలివితేటలున్నాయి.
ఐతే, జాగ్రత్తగా వినండి.
ఈ ప్రపంచాలలో నివసించేవారెవరికీ సూక్ష్మ, మానసిక ప్రపంచాల అనుభవం వుండదు.

వీరందరూ తప్పక మనం నివసిస్తున్న భూమి మీద జన్మ ఎత్తాల్సిందే!

అప్పుడే వారికి సూక్ష్మ – మానసిక ప్రపంచాల అనుభూతి లభిస్తుంది.

ఇది అవతార పురుషుని కాలం. అందునా మౌనావతారుని ప్రత్యేక సమయం. నేడు శాస్త్రజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందింది.

ఇతర గ్రహాల ఉపరితలాలపై నివసిస్తున్న అసమానమైన తెలివితేటలు గలవారు చాలామంది ఈ భూమ్మీద జన్మించారు.

అలాగే, మరెందరో మేధావులు కూడా ఈ భూమిమీద మానవ జన్మ ఎత్తడానికి ఈ అవతార కాలంలో తహతహలాడుతున్నారు.

అందుచేతనే నేడు ప్రపంచ జనాభా నానాటికీ శాస్త్రజ్ఞులకు అందనంత ఎత్తులో పెరుగుతోంది. ఒకటిమాత్రం బాగా గమనించండి!!

మీరు చూస్తున్నదంతా మిధ్య. భగవంతుడు ఒక్కటే సత్యం. నేను మానవ రూపధారిగా వచ్చిన భగవంతుడను.

ఇతర గ్రహాలమీద మానవాళి నివసిస్తోందని శాస్త్రవేత్తలు త్వరలో తప్పక కనుగొంటారు అని బాబా అన్నారు.

# భగవంతుడిని ప్రేమించు

భగవదైక్యం సాధించే వరకూ దేవుడ్ని ప్రేమించు. దేవుడిని ప్రేమించడం అంటే...

నిత్యం ఆయన నామ స్మరణ చేయడమే!

నిస్వార్ధ సేవ చేయడం ద్వారా కూడా భగవంతుడ్ని ప్రేమించడమేనన్నారు బాబా.

నేను ఈ పని చేస్తున్నాను. నా వల్ల వీరందరికీ లాభం చేకూరింది వంటి భావన లేశ మాత్రమైనా కానరాని విధంగా అవసరాల్లో వున్నవారిని ఆపదల్లో వున్నవాళ్ళని ఆదుకోవడం,

భగవంతుడిని ప్రేమించడమే అవుతుంది. భగవంతుడిని ఎలా ప్రేమించాలి?

ఈ విషయాన్ని అర్థం చేసుకోవడంతోనే సరిపెట్టుకోవద్దు. ఆ అనుభూతిని మనసారా అనుభవించండన్నారు బాబా! మీరు మీ మనస్సు ప్రభావానికి లోను కావద్దు అని హెచ్చరించారు.

Love God to such an extent that you become God! That love could be had through selfless service, but this service should be so sublime that there is not even a single thought of self.

What counts most is experience and not mere understanding. One has to go beyond one's mind! You can see Reality within you, but for this you have to dive deep within yourself.

# డాక్టర్ ఘనీతో మా జ్ఞాపకాలు



-ప్రతాప్ ఆహిర్, పూణే.

డా॥ ఘనీని **His Master's Voice** అని పిలిచేవాళ్ళం.

మెహెర్‌బాబావారి సందేశాలను, బాబా చెప్పిన అనేక ఆధ్యాత్మిక విషయాలను అందరికీ అర్ధమయ్యే రీతిలో చక్కగా వివరించి చెప్పే చతురత డా. ఘనీ సొంతంగా వుండేది. హిందూ వేదాంత గ్రంధాలు, అలాగే, సూఫీ, క్రైస్తవ మత గ్రంధాలను ఆయన ఆసాంతం చదివి ఆకళింపు చేసుకున్నాడు.

'ఎలాంటి మత గ్రంధాలు మెహెర్‌బాబా చదవలేదని నాకు బాగా తెలుసు. ఐతే, నేను అడిగే ప్రశ్నలన్నింటికీ తడుముకోకుండా బాబా చక్కని జవాబులు ఇచ్చేవారు. నేను ఆ మాదిరిగానే బాబావారి శిష్యునిగా మారానానని డా. ఘనీ స్వయంగా మాతో పలుమార్లు చెప్పారు. ఆ మాదిరిగా మౌనావతారుడైన మెహెర్‌బాబా **His Master's Voice** గా డా. ఘనీని తీర్చిదిద్దారు.

ఆ రోజుల్లో నిర్వహించిన మెహెర్ గెజిట్, మెహెర్‌బాబా పత్రికలలో డా. ఘనీ క్రమం తప్పకుండా ఎన్నో ఆసక్తికర ఆధ్యాత్మిక వ్యాసాలు రాశాడు.

డా. ఘనీ గొప్ప చతురుడు. మేధావి. బాబావారి బాల్యమిత్రుడు. బాబావారు ఏరికోరి ఎంచుకున్న ప్రియ శిష్యుడు డా. ఘనీ. పూణేలో బాబావారి ఇంటి ప్రక్కనే డా. ఘనీ గారి ఇల్లు ఉండేది.

కాలేజీ చదువుల దాకా డా. ఘనీ బాబాతో కల్సి చదువుకున్నాడు. ఆ దరిమిలా బాబావారి సాంగత్యంలోకి వచ్చాక అనేక పర్యాయాలు బాబాతో కలిసి పలు ప్రయాణాలు చేశాడు. పూణే నుండి ముంబాయికి నిర్వహించిన కాలినడక కార్యక్రమంలో, అలాగే ముంబాయి నుండి సాకోరికి పాదయాత్రలో బాబాతో ఆయన పాల్గొన్నాడు.

1932లో బాబాతో కల్సి ఇంగ్లాండు, యూరోపు, అమెరికా దేశాలలో డా. ఘనీ పర్యటించాడు. పర్షియన్, ఉర్దూ భాషలను బాగా అధ్యయనం చేసిన డా. ఘనీ, **'మున్సిఫ్'** అనే కలం పేరుతో అనేక అద్భుత రచనలు చేశాడు.

అనాడు మెహెర్‌బాబా పర్యవేక్షణలో ప్రచురించిన **మెహెర్‌బాబా పత్రికకు** మేనేజింగ్ ఎడిటర్‌గా కూడా డా. ఘనీ పనిచేశాడు.

విద్యార్థి దశ పూర్తయ్యాక డా. ఘనీ వివాహం చేసుకుని హోమియోపతి వైద్యునిగా ముంబాయిలో స్థిరపడ్డాడు. సమాజంలో మంచి పేరు ప్రతిష్టలు సంపాదించాడు. గౌరవ మేజిస్ట్రేట్‌గా కొద్దికాలం పనిచేశాడు. ఆ పిదప తిరిగి పూణేలో వున్న మెహెర్‌బాబాని కలిసి ముంబాయిలోని మంజిల్ -ఇ-మీం లో ఆశ్రమవాసిగా చాలాకాలం వున్నాడు.

ఆ దరిమిలా ఒక ప్రత్యేక కారణంతో మెహెర్‌బాబావారి ఆధ్యాత్మిక వాతావరణాన్ని వదిలి, సగటు వ్యక్తిలాగా ఈ మాయమయ జగత్తులో ప్రవేశించాడు డా. ఘనీ.

ఆ సమయంలో ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి ఎన్నో వ్యాపార లావాదేవీలు నిర్వహించాడు. రాజకీయ వాతావరణంలో కూడా పాల్గొన్నాడు. ఇదంతా ఆయన్ని అంటిపెట్టుకుని వున్న సంస్కారాలు డా. ఘనీని ఆ మాదిరిగా నడిపించాయని బాబా ప్రేమికులు అంటారు.

ఐనప్పటికీ 'తన శిష్యునిపై తన **నజర్** సంపూర్ణంగా వుందని, ఏదో ఒకరోజున తిరిగి ఆతడిని తన దగ్గరకు తీసుకొస్తానని మెహెర్‌బాబా ప్రకటించారు.

**"I will bring you back to Me at Pistol Point"** మెహెర్‌బాబా అన్నారు.

అదే నిజమైంది !!

### వ్యాపారంలో అపార నష్టం

డా. ఘనీ ఆనాడు చేస్తున్న వ్యాపార లావాదేవీలన్నింటిల్లో అపార నష్టం వచ్చింది. పూణేకు సమీపంలో వున్న **'లోనావాలా'** పట్టణంలో గల ఆయన యావదాస్తి స్థానిక మార్వాడీ హస్తగతమయింది. డా. ఘనీ అప్పటి దాకా చేసిన అప్పుల పాపానికి ఆయన ఆస్తులన్నింటినీ మార్వాడీ లోబరచుకున్నాడు.

దాంతో డా. ఘనీకి ఈ ప్రపంచంపైనే విరక్తి కల్గుతుంది.

ఒకరోజున నిండరా సురాపానం చేసి, ఆత్మహత్య చేసుకోవాలని నిశ్చయించుకున్నాడు.

లోనావాలాలో ఊరి చివరనగల చెరువు దగ్గరకెళ్ళాడు.

త్రాగిన మత్తులో తాను ఆరాధించే దేవతలందర్నీ, **మెహెర్‌బాబాను** సయితం అనరాని మాటలతో దూషించాడు.

ఆ తర్వాత అక్కడ వీచే చల్లని గాలుల ప్రభావం వల్లనో ఏమో గానీ, డా. ఘనీ చల్లగా గాఢ నిద్రలోకి జారుకున్నాడు.

సరిగ్గా ఈ సమయంలోనే మెహెర్‌బాబా ఆయన శిష్యులుతో కలిసి కారులో లోనావాలా వచ్చారు. స్పృహలేని స్థితిలో పడివున్న డా. ఘనీని బాబా తమ కారులో ఎక్కించుకొని అహ్మద్‌నగర్‌కు తీసుకొచ్చారు.

ఇది ఇలా ఉండగా సరిగ్గా ఆ రోజు రాత్రి డా. ఘనీ ఆస్థినంతా కబళించిన స్థానిక

మార్వాడీని గుర్తు తెలియని దుండగులు కొందరు హత్య చేశారు. ఆ మార్వాడీతో ఘనీకి వున్న వ్యాపార సంబంధాల వల్ల ఆ హత్యా నేరాన్ని ఘనీ భరించాల్సి వచ్చేది.

కానీ, హత్య జరిగిన రాత్రి బాబావారి ఆశ్రమంలో డా. ఘనీస్పృహలేని స్థితిలో సేద తీరుతున్నాడు.

దాంతో డా. ఘనీ తాను చేయని నేరం నుండి తప్పించుకున్నాడు.

ఇదంతా అవతారుని లీలగా డా. ఘనీ అభివర్ణిస్తూ – అంతక్రితం

**"I will bring you back to me at Pistol Point"** అన్న బాబా మాటలు అక్షర సత్యాలయినాయని డా. ఘనీ కృతజ్ఞతతో చేతులు జోడించి వినమ్రంగా మాతో తెలియజేశాడు.

## విధేయత

డా. ఘనీ హాస్య చతురత గురించి, ఆయన అపారమైన మేధా సంపత్తి గురించి బాబా మండలి సభ్యులు అనేక కథలు చెబుతుంటారు.

**ఆ కోవకు చెందినదే ఈ సంఘటన కూడా..**

డా. ఘనీ సిగరెట్లు చాలా ఎక్కువగా త్రాగేవాడు.

ఆయనొక పొగ బండి మాదిరి లాగా గుప్పుగుప్పున పొగ త్రాగడం ఆయన అలవాటు.

అలాగే ఆయనికి భోజనంలో మాంసాహారం తప్పనిసరిగా వుండాలి.

ఐతే, మెహెర్‌బాబా ఆశ్రమంలో ఈ రెండూ సాధ్యం కాదు కదా!!

మాంసాహారం లేకపోయినా సర్దుకుపోగలడేమో కానీ,

పొగ త్రాగకుండా వుండలేకపోయాడాయన.

పొగ లేకపోవడంతో డా. ఘనీ మందమతిగా, చురుకుగా లేకపోవడం గమనించి, ఒకరోజున బాబా ఆయన్ని పిలిచి రోజుకు ఐదు సిగరెట్లు త్రాగే అవకాశం ఇచ్చారు.

చైన్ స్మోకర్‌గా ఘనీ ప్రతీతి.

ఐదు సిగరెట్లు ఆయనకేం సరిపోతాయి.

ఐనప్పటికీ ఒకింత ఆయన సంతోషించి, తనదైన శైలిలో తన తెలివితేటలు ప్రదర్శించాడు.

అదేమంటే, నాలుగైదు సిగరెట్లను ఒక పుల్లకు ఒక పెద్ద సిగరెట్‌లా అమర్చి తృప్తిగా పొగ త్రాగడం ప్రారంభించాడు. ఈ విషయం బాబాకు తెలిసి డా. ఘనీ అవిధేయత పట్ల బాబా చికాకుపడ్డారు. తాను చేసిన పనికి డా. ఘనీ సంజాయిషీ ఇచ్చుకుంటూ బాబా నీ ఆదేశాల మేరకు నేను రోజుకు ఐదు సిగరెట్లు మాత్రమే త్రాగుతున్నాను.

ఐతే, నీవు సిగరెట్ పొడవు ఎంత వుండాలని చెప్పని కారణంగా నాలుగైదింటిని కలిపి ఒకటిగా కాలుస్తున్న మాట నిజం అని విధేయతగా జవాబిచ్చాడు.

డా. ఘనీ మాటలకు బాబా నవ్వుతూ...డా. ఘనీకి తన మానాన సిగరెట్లు కాల్చుకునే అనుమతి ఇచ్చారు.

# గోడపై నీళ్ళతో స్నానం!!

డా. ఘనీ ముంబాయిలోని మంజిల్-ఇ-మీంలో మెహెర్‌బాబా మండలి సభ్యులతో వుంటున్న రోజులవి.

మంజిల్-ఇ-మీం అంటే **'గురువుగారి ఆశ్రమం'** అని తెలుగులో సమానార్థంగా చెప్పుకోవచ్చు. ఆశ్రమం నియమావళి ప్రకారం అందరూ తెల్లవారుఝాముననే లేచి చల్లని నీళ్ళతో స్నానాలు ముగించాలి.

ఐతే డా. ఘనీకి చల్లని నీళ్ళతోనే కాదు, అసలు రోజూ స్నానం చేసే అలవాటే లేదు.

దాంతో ఆశ్రమంలో ఉండటం, ఆశ్రమ నియమాలు పాటించడం చాల కష్టమైంది.

అయినప్పటికీ ఈ నియమావళిని తన తెలివితేటలతో తప్పించుకోగల్గాడు.

అదెలా సాధ్యమయిందంటే,

అందరిలాగానే స్నానాల గదిలోకి డా. ఘనీ వెళ్ళి మగ్గుతో నీళ్ళు తీసుకుని బాత్‌రూం గోడలపై పోస్తూ, తానేదో చల్లని నీళ్ళతో ఇబ్బంది పడుతున్నట్లు రకరకాల శబ్ధాలు చేసేవాడు.

ఐతే, ఈ విషయాన్ని కొద్దిరోజులకే తోటి ఆశ్రమవాసులు కనిపెట్టేశారు.

డా. ఘనీ స్నానం చేయకుండా తమాషాలు చేస్తున్నాడని బాబా చెవిని వేశారు.

ఒకరోజున ఉదయాన్నే అకస్మాత్తుగా స్నానం సమయంలో డా. ఘనీ స్నానం చేస్తున్న బాత్‌రూంకి బాబా స్వయంగా వచ్చి తలుపు తీసుకుని లోనికి వెళ్ళి చూశారు.

**దొంగ దొరికిపోయాడు...**

బాబా డా. ఘనీకి చల్లని నీటితో స్నానం చేయించారు.

అవతారుని చేతుల మీద స్నానం చేసిన భాగ్యశాలి డా. ఘనీ ధన్యుడని సహాధ్యాయులు అందరూ భావించారు.

**కాదా మరి!!**

# బాబా! నీవెక్కడ లేవు?

హాస్యం హసితమైతేనే భాసిస్తుందన్నారు కవులు.

డా. ఘనీ హాస్య ప్రియుడు,

గొప్ప చతురుడని పలుమార్లు ఇంతక్రితమే చెప్పుకున్నాం కదా!!

డా. ఘనీ హాస్యాన్ని మెహెర్‌బాబా కూడా ఎంతో ఆనందించేవారు.

బాబా తన విశ్వకార్యక్రమ భారంతో తలమునకలయిన సమయంలో

డా. ఘనీ హాస్యం ఎంతో ఊరట కల్గించేదని,

మెహెర్‌బాబా స్వయంగా పలుమార్లు తన మండలివారితో అన్నారు.

ఐతే, బాబా ఆశ్రమంలో క్రమశిక్షణ ప్రధానం కదా!!

మరి, డా.ఘనీ ఏం చేశాడో, ఏమో కానీ, బాబాకు ఒక సందర్భంలో విపరీతమైన కోపం వచ్చింది.

ఆ కోపంలో డా. ఘనీని తక్షణం ఆశ్రమం వదలి వెళ్ళిపొమ్మన్నారు బాబా.

డా. ఘనీ కూడా చిన్న పిల్లవాడిలా వెంటనే లేచి తన సామాన్లను బ్యాగులో సర్ధుకుని వెళ్ళిపోవడానికి సిద్ధమయ్యాడు.

అలా వెళ్ళిపోయే ముందు తిరిగి బాబా ఎదుట నిలబడి ఎక్కడికి వెళ్ళమంటావ్ బాబా! అని డా॥ ఘనీ అమాయకంగా అడిగాడు.

ఎక్కడికైనా నీ ఇష్టమైన చోటకు వెళిపో!

నీ ముఖం నాకు చూపించవద్దన్నారు బాబా.

అలాగే బాబా అంటూ...

**నీవు లేని తావెక్కడుందో నాకు తెలియదు బాబా ...,**

(... He did not know any place where Baba was not?)

అందుకే అలా అడుగుతున్నానని వినమ్రంగా అన్నాడు.

బాబా నీవు అవతారుడవు. .

భగవంతుడవు కదా!!

**ఎందెందు వెతికిన అందందు... చందాన అన్నట్లు ....**

ఎక్కడకి వెళ్ళమంటావ్ అని అడిగానని వినయంగా జవాబిచ్చాడు.

బాబా కోపం చప్పున చల్లారిపోయింది.

గట్టిగా నవ్వేశారు.

దయగల తండ్రిగా డా. ఘనీని అక్కుని తీసుకుని,

ఘనీ చేసిన తప్పుని క్షమించి వదిలేశామన్నారు.

# బాబాలో ఐక్యం

నరసరావుపేట మెహెర్‌బాబా సెంటర్ ముఖ్య ప్రేమికులు శ్రీ కోట నరసింహారావు 01.02.2013 శుక్రవారం సాయంత్రం 5.30 నిమిషములకు బాబాలో ఐక్యమయ్యారు. వీరికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. వీరి తుదిశ్వాస విడిచేవరకు బాబా నామం జపిస్తున్న వీరు ధన్యులు.

ఇట్లు- కుమారులు - కోట కోటేశ్వరరావు,
కోట వెంకటేశ్వర్లు.

# సర్వధర్మాన్ పరిత్యజ్య...




హమీర్‌పూర్ జిల్లాకు చెందిన బాబా ప్రేమికుడు– శ్రీ కేశవ్ నారాయణ్ నిగం తన జీవిత చరిత్రను ఇంగ్లీషులో **మై లైఫ్ స్టోరీ విత్ అవతార్ మెహెర్‌బాబా** పేరుతో 1960వ దశకంలో గ్రంథస్తం చేశారు. ఇంగ్లీషులో వున్న ఈ పుస్తకాన్ని తెలుగులో **సర్వధర్మాన్ పరిత్యజ్య** శీర్షికతో మెహెర్‌బాబా పత్రిక తరఫున ప్రచురించి 2012 జూన్‌లో విడుదల చేయడమైంది.

మేను పులకరింపజేసే అనేక వాస్తవ జీవిత సంఘటనలు ఈ రచనలో కనిపిస్తాయి. కేశవ్‌జీ తన జీవితంలో అనుభవించిన అనేక ఉద్ధాన పతనాలను ఆసాంతం చదివిన పాఠకులు ప్రతి పదంలో తమ కళ్ళలో నీళ్ళు చిప్పరిల్లాయని చెప్పారు. బాబా ప్రేమికులందరికీ కేశవ్‌జీ ఆదర్శం. ప్రతిఒక్కరూ తప్పక చదవాల్సిన గ్రంధం, ప్రతి ఇంటా ఉండాల్సిన పుస్తకం..

**సర్వధర్మాన్ పరిత్యజ్య.**

**వెల..రూ. 50. ప్రాప్తిస్థానం..కేరాఫ్ ఎడిటర్, మెహెర్‌బాబా మాస పత్రిక.**

## ఎర్రని చిరునామాలు– గమనిక

**గత రెండేళ్ళుగా వార్షిక సభ్యత్వం చెల్లించని సభ్యుల చిరునామాలను ఈ సంచిక కవరుపై ఎర్రని రంగులో హెచ్చరికగా పంపుతున్నాం. దయచేసి గమనించి బాబా ప్రేమికులు తక్షణమే వారి వార్షిక సభ్యత్వం చెల్లించి సహకరించగలరు. లేనిఎడల 2013 మే నుండి పత్రికలు పంపబడవని గమనించగలరు. అలాగే, జీవితసభ్యత్వంలో రూ 500 మాత్రమే చెల్లించినవారు కూడా వారి బాకీ నగదు రూ 500 వెంటనే చెల్లించవలెనని మనవి. దయచేసి బాబా ప్రేమికులు సహకరించగలరు.**

**హెల్ప్‌లైన్** – మెహెర్‌బాబా పత్రికను ప్రతినెలా 20వ తేదీన సికింద్రాబాద్‌లో పోస్టు చేస్తున్నాం. 25వ తేదీ నాటికి పత్రిక మీ ముంగిట వుంటుంది. పత్రిక అందడంలో ఆలస్యమైతే శ్రీ వి. ఆర్. కె. శాస్త్రి, హైదరాబాద్ (98492–42284), లేదా శ్రీ కాగిత రామ్ (99481 28207) లను సంప్రదించగలరు.

మీ వార్షిక, జీవిత సభ్యత్వం సక్రమంగా చెల్లించి సహకరించవల్సింది.

# ఉత్తర కాశీలో బాబా ప్రేమిక సహవాస్

**(పి.యస్.కె.శర్మ)**

ఉత్తరాంచల్ రాష్ట్రంలోని ఉత్తర కాశీలో 2013 ఏప్రిల్ 10, 11 తేదీలలో ఏర్పాటుచేసిన మెహెర్‌బాబా ప్రేమికసహవాస్‌లో తెలుగువారు 120 మందికిపైగా హాజరయ్యారు. రిషీకేష్ నుండి 160 కి.మీ. దూరంలో సముద్రమట్టం నుండి సుమారు 1150 అడుగల ఎత్తులో హిమాలయ మంచుకొండల సమీపంలో జిల్లా కేంద్రంగా ఉత్తరకాశీ వుంది. తెలుగు వారందరూ ముందుగా ఏప్రిల్ 8కి రిషికేష్ చేరుకున్నారు. ఆ మర్నాడు అక్కడ నుండి ఐదారు బస్సుల్లో బయల్దేరి ఆరు గంటల ప్రయాణం తర్వాత చీకటిపడే సమయానికి ఉత్తరకాశీ చేరారు. ఈ ప్రయాణమంతా కూడా కొండచరియల మధ్య నుండి దట్టమైన అటవీ ప్రాంతం గుండా సాగుతుంది. ఎత్తైన పర్వతాలు, ఆ పర్వతాల అంచున అంతులేని అగాధాల్లాంటి లోయలు, ఆ లోయల్లోంచి పెల్లుబిక్కిన దట్టమైన పచ్చని అడవి. అడుగడుగునా ఎత్తుగా పెరిగిన పచ్చని దేవదారు వృక్షాలు కనువిందుచేశాయి. ఉత్తరకాశీ పట్టణంలో సహవాస్ కార్యక్రమానికి రెండ్రోజుల ముందునుండి బాబా ఫోటోలు, కరపత్రాలు విరివిగా పంచిపెట్టారు. దాంతో బాబా ప్రేమికులకి వారెవరో పరిచయంచేసుకునే అవసరం లేకపోయింది.

1940వ దశకంలో మెహెర్‌బాబా కఠిన మౌనంలోనే మన దేశంలో కొన్ని వేల మైళ్ళ దూరం అలుపెరగక ప్రయాణంచేసి, పిచ్చివాళ్ళలాగా కనిపించే భగవదున్మత్తులైన కొన్ని వేలమంది మస్తులతో సాంగత్యం చేశారు. మస్తుల అన్వేషణలో భాగంగానే మెహెర్‌బాబా 1948 ఏప్రిల్ 11, 12 తేదీలలో ఉత్తర కాశీలో పర్యటించి, 35 మంది మస్తులు, 25 మంది సాధువులతో సాంగత్యం చేశారు. మెహెర్‌బాబా పాదస్పర్శతో పునీతమైన ఈ ప్రాంతంలో రెండ్రోజుల ప్రేమిక సహవాస్‌ను ఘనంగా నిర్వహించారు. పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శ్రీ బి. రామక్రిష్ణయ్య మెహెర్‌బాబా జరిపిన మస్తుల సాంగత్యంపై సవివరంగా వివరించారు. కాగా, బాబా సందేశాలపై శ్రీ బుడే క్రిష్ణయ్య, రిటైర్డ్, సెంట్రల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్, హైదరాబాదు, శ్రీమతి శివనాగేశ్వరి, శ్రీ శ్రీవాత్సవ, లక్నో, శ్రీ ఎస్.డి. లలిత్, రూర్కీ, శ్రీమతి విమలాగోల్, శ్రీమతి దీప్తి ఖన్నా, శ్రీ పి.సి. నిగం ప్రసంగించారు. శ్రీ కె.డి. నిగం ఏకపాత్రాభినయంలో దౌలత్‌సింగ్ పాత్రను ప్రదర్శించాడు. ఏప్రిల్ 10న సుమారు 2 కి.మీ. దూరంలో గల తిలోట్ గ్రామం దాకా నగర సంకీర్తన నిర్వహించారు. బాబా ఈ గ్రామంలో **విష్ణు దత్త దిగంబర్** అనే మస్తుతో సాంగత్యం చేశారని తెలిపారు. ఆనాడు మెహెర్‌బాబా ఆయన మండలి సభ్యులు **'బిర్లా సంస్థ** నిర్మించిన ధర్మశాలలో బసచేశారు. రెండ్రోజుల సహవాస్ పూర్తయ్యాక బాబా ప్రేమికులందరూ బిర్లా ధర్మశాలను సందర్శించి బాబా ప్రార్ధనలు చేశారు. ఏప్రిల్ 12న ఉత్తర కాశీ నుండి బయల్దేరి ఢిల్లీకి చేరుకుని, స్థానిక బాబా ప్రేమికుల ఆహ్వానం మేరకు ఢిల్లీ బాబా సెంటర్‌ను సందర్శించారు. అక్కడ బాబా సత్సంగ్‌లో పాల్గొన్నారు. డాక్టర్ నాగేంద్ర ప్రసాద్ వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది. ఆ పిదప, స్వగ్రామాలకు తిరుగు ప్రయాణమయ్యారు. *



# అవతార్ మెహెర్‌బాబా జీవితచరిత్ర

ఆంగ్ల మూలం: – భావూ కల్చూరీ, లార్డ్ మెహెర్,
వాల్యూం-4 (1929 మే నుండి) – తెలుగుసేత: మల్లాది రామారావ్,
న్యూఢిల్లీ

*(గత సంచిక తరువాయి)*

## లార్డ్ మెహెర్

## వాల్యూం-4 (1929 మే నుండి) ప్రారంభం

ప్రస్తుత కథాంశం 1929వ సంవత్సరం మే నెల నాటిది.
ఐదు నెలలపాటు అంటే సెప్టెంబరు నెలాఖరు వరకు బాబావారి
జీవిత విశేషాల సమాహారం ఇది.
మెహెరాబాద్ నుంచి హిమాలయాలకి బయలుదేరారు బాబా.
ఆలీ అక్బర్, బువా సాహెబ్, ఛాన్జీ, ఛగన్, పెసూ, మాసాజీ, గుస్తాద్‌జీ శ్రీవారి వెంట కదిలారు.
వీరి మొదటి మజిలీ మే ఎనిమిదిన అహమ్మద్‌నగర్‌లో నౌసేర్వాన్ సాథా ఇంట.
రమ్జూ, బైలీ కూడా వచ్చారు అక్కడికి.
ఉత్తర దేశ యాత్ర అంటే మాటలు కాదు కదా.
దూర ప్రయాణం. చూడవలసిన క్షేత్రాలు ఎన్నో.
ముందుగా ఎక్కడికి వెళ్ళాలి? ప్రయాణానికి ఏఏ ఏర్పాట్లు అవసరమవుతాయి.
వెళ్ళిన ప్రతిచోటా బసకి ఏర్పాట్లు కావాలి కదా!
అవి ఎలా చేయాలి? ఇలా ఎన్నో విషయాలపై తర్జన భర్జన జరిగింది చాలాసేపు.
ఎవరికి తోచిన సలహా వారిచ్చారు. ఎవరి సలహా నచ్చలేదు బాబావారికి.
ముందుగా ఋషికేష్‌కి వెళ్ళాలని వుందన్నారు.
ఈశ్వరేచ్ఛకి ఎదురు చెప్తారా ఎవరైనా.
అందరూ సరేనన్నారు.
రెండవ మజిలీ మే తొమ్మిదవ తేదీన నాసిక్‌లో.
మెహెరా, నాజా, ఖుర్షేద్, సూనా, వాలూ, ఫ్రీనీ వుంటున్నారక్కడ అప్పట్లో.
రుస్తుం పాద్రీ కూడా అక్కడే వున్నారు.
హిమాలయాల నుంచి బాబా తిరిగి వచ్చేవరకు స్త్రీ మండలి నాసిక్‌లో

వుంటుంది కాబట్టి వారి బాగోగులు చూసే బాధ్యత రుస్తుంపై పడింది.
మే 10వ తేదీన బాబావారు హరిద్వార్‌కి బయలుదేరారు.
నాసిక్ నుండి మన్మాడ్‌కి బస్సులో వెళ్ళి అక్కడ
ఢిల్లీ – అలహాబాద్ ఎక్స్‌ప్రెస్ ఎక్కారు. ఖాండ్వా దగ్గరపడ్తుంటే, రైలు ఆగింది.
అదో చిన్న పల్లెటూరు.
చిన్న స్టేషన్. వస్తున్న రైలుని గమనించకుండా పట్టాలు దాటబోయాడట ఓ వ్యక్తి.
రైలు క్రింద పడలేదు కానీ, రైలు వేగానికి పట్టాల ప్రక్కకి విసిరివేయబడ్డాడు.
బాగా దెబ్బలు తగిలాయి. అంటే జనం పోగయ్యారు.
"రైలు ఆగింది.
ఫ్లాట్ ఫారమ్ పైన అన్నం దొరుకుతుందేమో చూడు, అన్నంతో పాటు పప్పు
కూడా పొట్లాం కట్టించుకురా, అని బాబావారు ఛగన్‌కి పని చెప్పారు.
బాబావారికి అప్పుడే ఆకలి వేయ్యాలా అనిపించింది ఛగన్‌కి.
ఓ ప్రక్క ఓ మనిషి క్రిందపడి గిలగిలా కొట్టుకొంటున్నాడు.
అందరూ వాడిని చూడటానికి పరిగెడ్తుంటే, మా దేముడికి మాత్రం ఆకలి వేస్తోంది.
తినటానికి ఏదైనా పట్టుకురా అని పురమాయిస్తున్నాడు.
ఇదేమి చోద్యం అనిపించింది.
బాబావారు దయార్ద్ర హృదయుడు అంటారే, దయ అంతా ఏమయింది.
దెబ్బలు తిన్నవాడి పట్ల కాస్తంత కనికరం చూపించనక్కర్లేదా.
మందుల డబ్బా దగ్గరే వుంది కదా.
ఏదో మందు మాకు ఇవ్వొచ్చు కదా. అలాంటిది ఏమీలేదు సరికదా,
ఆకలి వేస్తోంది, తినటానికి పట్టుకురమ్మంటారా!!
భోజనానికి ఇదేన సమయం?
భలే బాగుంది బాబావారి ధోరణి అని సణుక్కొంటూ ఛగన్, టీస్టాల్ చేరాడు.
అక్కడ అన్నం పప్పు రెడీగా వున్నాయి.
బాబావారి కోసం పొట్లాం కట్టించాడు.
ఫ్లాట్ ఫారమ్‌పై జనం బాగా వున్నారేమో, వాళ్ళని తప్పించుకొని వెళ్ళాలి.
కానీ ఎలా వెళ్ళేది? ఎవరి హడావిడి వాళ్ళది.
ఎవ్వరూ దారివ్వడంలేదు సరికదా క్రింద పడ్డవాడిని చూడ్డానికి ఎగబడుతున్నారు.
అదో చోద్యం వాళ్ళకి. ఛగన్ కష్టం వాళ్ళకి ఏమి తెలుసు.
ఆలస్యమైతే బాబావారు రుద్రమూర్తి అవుతారు.
ఈ సంగతి ఛగన్‌కి కొత్త కాదు.
అందుకనే దగ్గరకి ఎంత తొందరగా వద్దామని అతగాడు అనుకొన్నా సాధ్యం

కాలేదు. ఛగన్ అనుకున్నట్లే బాబావారికి చిరాకు వేసింది.
కోపం వచ్చింది. "ఏమయిపోయాడో ఛగన్, చూసిరా" అని గుస్తాద్‌జీని పంపారు.
ఇంతలో ఛగన్ రానే వచ్చాడు.
బాబావారు రెండు అక్షింతలు వేశారు.
ఎప్పుడనగా వెళ్ళావు. ఎప్పుడు వచ్చావ్ అని చివాట్లు పెట్టారు.
"సరే, ఆ పొట్లాం ఇలా ఇవ్వు," అన్నారు.
నేనేం తప్పుచేశానని నాకీ దీవెనలు.
అంత మంది జనాన్ని త్రోసుకురావటం మాటలా ఏమన్నానా, అనిపించింది ఛగన్‌కు.
బాబా అదేమీ పట్టించుకోలేదు.
ఆ రెండు పొట్లాలు ఇవ్వమన్నారు.
వెంటనే ఆ పొట్లాలు విప్పారు. పప్పు, అన్నం కలిపారు.
ఆత్రంగా తినసాగారు. ఏమయింది బాబావారికీవాళ అనుకొన్నాడు ఛగన్.
ఫ్లాట్ ఫారంపైన కొనఊపిరితో కొట్టుకుపోతున్నారొకరు.
ఇక్కడ రైల్లో కడుపునిండా ఆరగిస్తున్నారు దైవత్వం మూర్తీభవించిన మరొకరు.
విడ్డూరంగా కనిపించింది.
ఛగన్ మనస్సులో మాట బాబావారికి తెలియకపోతే కదా!
అందుకనే, ఏదో సణుక్కొంటున్నావే?
ఆ మాట ఏదో పైకి చెప్పు అన్నారు.
ఖంగుతిన్నాడు ఛగన్. అబ్బే, అదేమీలేదు బాబా! నేనేమీ అనుకోవటంలేదు.
వూరికే అలా కిటికీలోంచి చూస్తున్నానంతే అన్నాడు.
'సరే! నీ ఇష్టం' అన్నారు బాబా.
నువ్వు చెప్పకపోయినా, నీ మనస్సులో మాట నాకు తెలియదా అన్న భావం
బాబావారి మాటల్లో వ్యక్తమైంది.
అయ్యో! ఆ గాయపడ్డ వాడికి ఏమవుతుందో అని తప్ప మరో ధ్యాస లేదు
నీకు అన్నారు. నీ సానుభూతి వల్ల వాడికి ఏమీ ఒరగదని ఎద్దేవా చేశారు.
ఫ్లాట్ ఫామ్‌పై పడిపోయిన వ్యక్తి గొడవలో పడి, తమ గురించి
పట్టించుకోవటంలేదని నిష్ఠూరం ఆడారు. ఛగన్‌కి ఏం చెప్పాలో అర్థం కాలేదు.
నేను ఏదో పప్పు అన్నం తింటున్నాను. ఇదేగా నీ కళ్ళకు కనిపిస్తున్న దృశ్యం.
అందుకేగా ఆ క్రిందపడ్డ వ్యక్తికి బాబా ఊరట కల్గించడంలేదనుకొంటున్నావ్.
అవునా? వాడికి నేనేమి చేస్తున్నానో నీకు తెలుసా? కనీసం ఊహించగలవా?
బాబావారి చేతుల్లోనే సర్వం, సర్వస్వం వున్నాయి అని నువ్వు నమ్మితే,
నా ఇచ్ఛ మేరకే వాడు క్రింద పడ్డాడని అనుకోవచ్చుగా?

కానీ నీకా భావన కల్గటంలేదు.
అవునా! కాదా!
నా ఇచ్ఛ లేకుండా గడ్డి పోచైనా కదలదని నువ్వు నమ్మితే, వాడికి ఏమయినా అది నా ఇచ్ఛ ప్రకారమే అని అనుకోవాలి కదా! అలా ఎందుకు అనుకోవు.
ఇది తప్పా! కాదా!
నా ఇచ్ఛ ప్రకారం నడవటమే నీ ధర్మం. నీ విధి. నీ ఆలోచనలకి పదునుపెట్టకు.
నువ్వు కోరినట్లు అన్నీ జరగాలనుకోకు అన్నారు.
నీ కళ్ళ ముందు కూర్చుని నేను పప్పు అన్నం తింటున్నాను కాబట్టి
బాబావారు పప్పు అన్నం తింటున్నారనుకొంటున్నావ్.
కానీ నేను తిన్న ప్రతి ముద్ద, నీవు జాలిపడుతున్న వాడి పొట్టలోకే వెడుతున్నాయి.
అది నీ కళ్ళకు కనబడదు. అందుకనే ఆ వైనం నీకు తెలీదు అని ఛగన్‌కి చెప్పారు.
అతగాడు జన్మజన్మలకీ మరిచిపోలేని సత్యం ఒకటి చెప్పారు.
సృష్టిలోని ప్రతి ప్రాణికీ శుభం చేసేది నేనే.
అందరికీ మేలు చేసేది నేనే.
ఈ సంగతి సర్వదా గుర్తుంచుకో అన్నారు.
నీ దయవల్ల దమ్మిడీ కొరగాదు ఎవ్వరికీ అన్నారు.
నీ సానుభూతి ఎందుకూ పనికిరాదు అన్నారు.
నా ఇచ్ఛనెరవేర్చాలంటే, నీ కోర్కెలని దహించేయాలన్నారు.
కోర్కెలు తగలబడి, బూడిదయితేనే తప్ప తన సేవకి అర్హుడవు కావని
ఛగన్‌కి స్పష్టం చేశారు.
బాబావారి మాటల్ని నోరు వ్రెళ్ళబెట్టి విన్నాడు ఛగన్.
ఔరా! బాబావారి మాట నిజమే! తప్పు అయింది మళ్ళీ ఇలా చేయకూడదు.
బాబావారి దివ్యత్వాన్నే శంకిస్తే ఎలాగా అనుకొన్నాడు.
కంఠంలో ప్రాణం వున్నంత సేపూ ఇటువంటి పొరపాటు మళ్ళా చేయనని
ఒట్టు వేసుకొన్నాడు.
ఆ క్రింద పడ్డవాడిని చూసిరా, ఒకసారి అని బాబావారు చెప్పారు.
వెంటనే పెట్టె దిగి, జనం గుంపుగా వున్న వైపుకి వెళ్ళాడు.
అక్కడి దృశ్యం నమ్మశక్యంగా లేదు.
క్రిందపడ్డ వ్యక్తికి స్పృహ వచ్చింది. లేచి కూర్చొన్నాడు. టీ త్రాగుతున్నాడు.
పెద్దగా దెబ్బలు తగల్లేదు ఇతగాడికి అని అక్కడికి వచ్చిన డాక్టరు అంటున్నాడు.
అంబులెన్సు వచ్చింది. ఆస్పత్రికి తీసుకువెడ్తాము. ఏదో చిన్న ఫ్రాక్చర్ అయింది.
కట్టువేస్తే సర్దుకుపోతుంది అని డాక్టరు అంటుంటే, ఛగన్‌కి కళ్ళు తిరిగినంత పనయింది.

ఓ అరగంట క్రిందట చూసిందేమిటి? ఇప్పుడు కన్పిస్తున్నదేమిటి?
అంతా ఏదో మాయలా వుందనిపించింది.
పొరపాటయింది.
బాబావారినే శంకించాను అని మళ్ళా లెంపలు వేసుకొన్నాడు మనస్సులోనే.
అన్నం తెమ్మంటే బాబావారికి ఆకలివేస్తోంది అనుకొన్నాడు ఛగన్.
బాబావారికి ఆకలి వేయటంలేదనీ తనకి ఓ గుణపాఠం నేర్పడానికే.
బాబావారు ఆకలి వేస్తోందన్నారని తెలీలేదు పాపం.
బాబావారు ఏఏ స్థాయిల్లో, ఏఏ ప్రకారంగా పనిచేస్తారో ఎవరికి తెలుసును కనుక.
బాబావారి కనుసన్నల్లో వున్నంత మాత్రాన ఛగన్‌కి తెలియాలని లేదు కదా.
ఒక్క ఛగన్ కేం ఖర్మ!
మిగిలిన శిష్యులకి సహితం తెలీదు.
మాటల్తో కాకుండా, తమ చేతల ద్వారా జ్ఞానబోధ చేసేవారు బాబావారు.
జ్ఞానబోధ అన్నంత సులువు కాదు కాబట్టి, శిష్యులకి అర్థం అయ్యేలా
సంగతీ సందర్భం చెప్పడానికి బాబావారు చాలా కష్టపడాల్సి వచ్చేది.
ప్రపంచ భారాన్నే మోసిన బాబావారికి ఇదీ ఓ కష్టమేనా.
ఛగన్ ఉదంతం చూస్తే తెలియటం లేదూ, బాబావారు
ఎంత ఓపికగా వ్యవహరిస్తారో కొత్త విషయాలు చెప్పేటప్పుడు.
మే 11న బాబావారు ఢిల్లీ చేరారు. ఆ రాత్రి బస ఆ మహానగరంలోనే.
కాస్తంత రైలు ప్రయాణపు బడలిక తీర్చుకొని మర్నాడు హరిద్వార్‌కి బయలుదేరారు.
ఢిల్లీకి ఐదు, ఆరు గంటల దూరంలో వున్నదీ పావన క్షేత్రం...
హిమాలయాలు దేవభూమి అయితే,
హరిద్వార్ ఆ దేవ భూమికి స్వాగత ద్వారం.
ఇక్కడ గంగానది ఎంతో పవిత్రంగా, ఎంతో స్వచ్ఛంగా దర్శనమిస్తుంది.
తెల్లవారుఝామున అయినా, మిట్ట మధ్యాహ్నమయినా, సాయంత్రమయినా సరే,
ఎప్పుడు స్నానం చేసినా కలిగే భావన ఒక్కటే.
బయట చలి ఒణికిస్తున్నా, నీళ్ళలో అడుగు పెట్టగానే చలి పారిపోతుంది.
స్వానుభవమున చెప్పుతుంటి సుజనులారా అని చెప్పుతున్నాడీ సంగతిని,
ఈ అనువాదకుడు.
పవిత్ర కాశీ క్షేత్రంలో గంగా స్నానానుభవం వేరు.
హరిద్వార్‌లో గంగా స్నానానుభవం వేరు.
రెండు చోట్లా గంగానది ప్రవహిస్తున్నా, సాధకుడికి కలిగే అనుభూతి మాత్రం
ఒకటి కాదు. ఇదొక సృష్టి విచిత్రం. అంతుచిక్కని మర్మం.

బహుశా బాబావారే ఈ చిక్కుముడి విప్పుతారేమో చూడాలి.
13వ తేదీ ఉదయం బాబావారు గంగ ఒడ్డుకి వచ్చారు.
అప్పటికే చాలామంది స్నానాలు చేస్తున్నారు.
ఆ రద్దీని తప్పించుకొని, నిర్మానుష్యంగా వున్న జాగాకి వెళ్ళారు.
అక్కడ కూర్చొని గంగమ్మ తల్లికేసి తేరిపారా చూస్తున్నారు.
బహుశా బాబావారిక్కడ చాలాసేపు కూర్చొంటారేమో అనిపించింది వెంటవున్న మండలికి.
కానీ బాబావారు ఎక్కుసేపు కూర్చోలేదక్కడ.
హరిద్వార్‌లో నా పని పూర్తయింది.
పోదాము పదండి అన్నారు.
ఇంత త్వరగా అయిపోయిందా బాబావారి పని అని మండలివారు ఆశ్చర్యపడ్డారు.
బాబావారితో ఎప్పుడూ ఇంతేకదా అని సమాధానపడ్డారు.
ప్రభువు వెంట బసకి బయలుదేరారు.

**అనంత అవిశ్రామికుడు మెహెరుడు.**
**వుంటాయాయన కళ్ళముందు,**
**అణువు కణువు ఎప్పుడూ,**
**అన్నింటినీ, అందర్నీ చెస్తాడు ప్రభావితం,**
**నిమిత్తం లేదు కాలంతో ఆ పనికి, కాసేపయినా, కూసేపయినా ఒక్కటే,**
**చైతన్యపు లోతులు తెలియాలి అద్దం పట్టాలంటే ఆ పనికి.**

గంగ ఒడ్డు నుంచి కదిలిన కాసేపటికే, పదండి పోదాం ఋషికేష్‌కి అన్నారు బాబా.
హరిద్వార్ నుంచి ఒ అరగంట ప్రయాణం.
అందరూ ఋషీకేశ్ దారి పట్టారు.
సాధువులు గుంపుగా నడుస్తూ కనిపించారు.
కాషాయం బట్టలు కట్టారువారు.
నుదిటిన వీభూతి దిద్దారు.
చేతులకీ మెడకీ కూడా విభూతి దిట్టంగా పట్టించారు.
తలపై జుట్టు అట్టలు కట్టింది.
కాళ్ళ వరకూ పెరిగింది కొంతమందికయితే...
వాళ్ళని చూస్తుంటే అమ్మో!
వీరెంత పుణ్యాత్ములో, ఎంతగొప్ప జిజ్ఞాసులో అనిపిస్తోంది.
కానీ బాబావారు వాళ్ళని చూస్తూనే పెదవి విరిచారు.
వీరంతా కపట సన్యాసులన్నారు.
వీళ్ళు మాయలో పడి కొట్టుకుంటున్నారు.

పైకి మాత్రం మాయకి ఆమడ దూరంలో వున్నట్లు ఫోజుపెడుతున్నారు.

ఇదో నాటకం.

ఇందువల్ల ఇంకాస్తంత పాపం మూటకట్టుకొంటున్నారీ సాధువులు అని చెప్పారు.

వీరెవరూ కోర్కెలని జయించలేదన్నారు.

అసలు వాళ్ళకి లేని కోర్కె లేదన్నారు.

హాయిగా తినాలనీ, త్రాగాలనీ, మంచి బట్టలు వేసుకోవాలనీ ఇలానే ఎన్నో కోర్కెల తుట్టలు వాళ్ళ స్వంతం అన్నారు.

చూసేవారికే సాధువులు వీరు.

మనోనాశనం సాధించినవాడే అసలైన సాధువు.

ఆ అదృష్టం వీరిని వరించలేదని స్పష్టం చేశారు.

ఋషీకేష్‌లో ఎన్నో ఆశ్రమాలున్నాయి.

ఎక్కడ చూసినా ఋషులు, సాధువులు, సాధకులు దర్శనమిస్తున్నారు.

ఇక్కడ బాబావారు ఎక్కువ రోజులు ఉంటారేమోననిపించింది.

కానీ ఎందుకనో బాబావారిలో సంతోషం కనిపించలేదు సరికదా,

ఇక్కడి నుంచి వెళ్ళిపోదాం అన్నారు. వెంటనే ప్రయాణం ఏర్పాట్లు చకచకా జరిగాయి.

కొత్త మజిలీ క్వెట్టా. ప్రస్తుతం పాకిస్థాన్‌లో వున్న ఈ నగరం

బాబావారి విశ్వ కార్యక్రమంలో ప్రముఖ పాత్ర వహించింది.

మే 18న చేరారు క్వెట్టాకి.

ఈ ప్రయాణం సుఖంగా జరగలేదు.

ఓ ప్రక్క మే నెల ఎండలు మాడ్చేస్తున్నాయి.

మరోప్రక్క రైలు కిక్కిరిసి ఊపిరి సలపటంలేదు.

16 రాత్రి పావుతక్కువ పన్నెండింటికి రైలు రోహ్రిలో ఆగింది.

బాబావారు పెట్టె దిగారు. ఛాన్జీతో మాట్లాడుతూ ఫ్లాట్ ఫారమ్‌పై నిలబడ్డారు.

మాటల మధ్యన గుండె నెప్పిగా వుందన్నారు.

మొహం పాలిపోయింది. నిలబడలేరు, కూర్చోలేరు.

ఓ నిమిషం కూర్చున్నా వెంటనే లేచి నిలబడుతున్నారు.

నీళ్ళ విరోచనాలు అవుతున్నాయి.

మండలివారికి గాభరా పుట్టింది. కాళ్ళు చేతులూ ఆడలేదు.

అందరూ రైలు దిగారు. ఈ రాత్రికి వెయిటింగ్ రూమ్‌లో వుందామని వెడితే,

అదీ కిక్కిరిసి కనిపించింది. ఇహ లాభంలేదని ఫ్లాట్ ఫారమ్‌పైనే కూర్చోందామంటే, ఎక్కడ చూసినా జనమే జనం.

**-సశేషం**

# సంవాదం



Dhakephalkar

ఒక సందర్భంలో మెహెర్‌బాబా
తన సందేశం
ఇచ్చి, ఆపై మండలి వారందరితో ముచ్చటిస్తూ వారి వారి అభిప్రాయాలు చెప్పమన్నారు.
ఈ సంఘటన మెహెరాజాద్‌లో జరిగింది.
బాబా మండలి సభ్యులు
డాకే ఫాల్కర్, రమ్జూ అబ్దుల్లా
ఇలా చాలామంది బాబా
చుట్టూతా వున్నారు.
ముందుగా ఆనాటి చర్చలో ధాకే ఫాల్కర్ తన అభిప్రాయాన్ని చెప్పి తన మానాన కూర్చున్నాడు.
ధాకేజీ అభిప్రాయంతో డా. ఘనీ, అంగీకరించలేదు.
అంతేకాదు, ధాకేజీని వ్యతిరేకిస్తూ చాలా కటువుగా
**"ఇది గడ్డి తినేవారికి ఎలా అర్థమౌతుంది"** అని డా. ఘనీ నోరు జారాడు.
ధాకే ఫాల్కర్ ఏదో పరిహాసంగా తీసుకున్నా, బాబా మాత్రం ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నారు.
బాబా ధాకే కేసి చూసి తగిన విధంగా ప్రతిస్పందించమన్నారు.
ధాకేజీ శాఖాహారి.
గడ్డి తినేవారికి ఎలా అర్థమౌతుందని ధాకేని ఉద్దేశించి
అగౌరవంగా డా. ఘనీ వ్యాఖ్యానించడం ఎంతవరకూ సబబు.
దాంతో, ధాకేజీ శాఖాహారం ప్రాముఖ్యత వివరిస్తూ,
తనదైన శైలిలో తన వాదన గట్టిగా ఇలా వినిపించారు.
ఇకపై ధాకేజీ మాటల్లోనే పరిశీలించండి!!
అనాదిగా "జంతు ప్రపంచంలో మాంసాహారులు – శాఖాహారులంటూ రెండూ వున్నాయి.

మాంసాహారం భక్షించే జంతువులకు నోట్లో పళ్ళు, గోళ్ళు, పంజాలాంటివి
భగవంతుడు వాటికి ప్రత్యేకంగా ప్రసాదించాడు.
అవి నీళ్ళు త్రాగడంలో కూడా ప్రత్యేకంగా వుంటుంది.
మాంసాహారం తీసుకునే జంతువులు నీటిని నాలుకతో నాకుతూ త్రాగుతాయి.
శాఖాహారం మాత్రమే తినే జంతువులు గడ్డి, ఆకులు తింటూ
నీటిని నోటితో పీల్చి త్రాగుతాయి.
ఇక మానవుని విషయానికి వస్తే, ప్రకృతి అతనికి శాఖాహారం
అలాగే మాంసాహారం రెంటినీ ఏర్పాటు చేసింది.
మనిషి నీటిని నాలుకతో కాకుండా, నోటితో పీల్చి త్రాగుతాడు.
అంటే ప్రకృతి మానవుడు శాఖాహారంగా వుండాలనే ఆశించింది.
మన పండిత మిత్రుడు డా. ఘనీ కూడా నీటిని నోటితోనే త్రాగుతాడు.
నాలుకతో చప్పరించడు కదా!
అలాగే, మానవునికి ప్రకృతి ప్రసాదించిన చేతి గోళ్ళు, నోటిలో పళ్ళు ఇవన్నీ
కూడా ప్రత్యేకమైనవి.
మానవుని నోటిలోని పళ్ళు పళ్ళు – ఫలాలు కొరకడానికి తప్పించి
జంతువుల మాదిరి శరీరంలోని కండల్ని కొరికి తినడానికి కాదు.
అనాగరిక రోజుల్లో మానవులు కుందేళ్ళు, లేడిపిల్లలు వంటి జంతువులను
వేటాడి వాటి పచ్చి మాంసాన్నే తినేవారు.
ఐతే, మానవుడు నాగరికత అలవరచుకున్నాక, నిప్పుని కనుగొన్నాడు.
ఆ నిప్పుతో నీళ్ళు కాలుచుకుని, ఉడికించుకుని తినడం అలవాటు
చేసుకున్నాడు. క్రమేణా మానవుడు పప్పు ధాన్యాలు కూరగాయలు,
సుగంధ ద్రవ్యాలు రకరకాల నూనెలు, వెన్న ఇలాంటివన్నీ కనుగొన్నాడు.
వీటితో ఆహారాన్ని రుచికరంగా తయారు చేసుకుని తినడమే కాదు
మానవ శరీరానికి అవసరమైన విటమిన్లు, ప్రోటీన్లు, క్రొవ్వు పదార్థాలు,
ఇతర పోషక విలువలు వాటివల్ల లభిస్తాయని తెలుసుకున్నాడు.
తొలినాళ్ళలో హిందువులందరూ మాంసాహారులే.
ఐతే, బుద్ధ భగవానుని బోధనలకు ప్రభావితులైన వారు కొందరు
కేవలం శాఖాహారం మాత్రమే తీసుకోవడం మొదలెట్టారు.
అంటే మాంసాహారం తీసుకోవడమనేది చాలా ప్రాచీనమైనది.
అనాగరికం కూడా.
శాఖాహారం భుజించడం ఆధునికం, నాగరికతకు చిహ్నం అని నా భావన.
శాఖాహారంలో ఎన్నోరకాలు, ఎన్నో రుచులతో తయారుచేయొచ్చు.

నాకు బాగా గుర్తు!
అదేమంటే ఒకసారి మెహెర్‌బాబా మా ఆహ్వానం మేరకు తన శిష్యులందరితో
కలిసి మా ఇంటికి వచ్చారు.
బాబా రాక సందర్భంగా, బాబా కోసం ఆయన శిష్యులందరి కోసం
నా భార్య రమారమిన నూరు రకాల శాఖాహారం భక్ష్యాలను తయురుచేసింది.
బాబా తన చూపుడు వేలుతో అన్ని పదార్ధాలు రుచి చూశారు.
ఒక్కో పదార్ధం ఒక్కో రుచి.
ఆ శాఖాహారం పదార్ధాలు రుచి చూసి బాబా చాలా సంతోషించారు.
అంతేకాదు, బాబా స్వయంగా తన చేతులతో తన శిష్యులందరికీ
ఆయా పదార్ధాలను వడ్డించారు.
చివరిగా నాదొక మాట.
"నాగరిక సమాజం శాఖాహార భోజనాన్ని సమర్ధించింది.
ఈ విషయం నా ప్రియమిత్రుడు డా. ఘనీకి తెలియదు.
అలా అని మాంసాహారం చెడ్డదని నా అభిప్రాయం కాదు.
అదొక రకమైన ఆహారం.
ఒక ప్రముఖ ఉర్దూ కవి పండితుడు అన్నట్లు
**"How could the hen know the food of the peacock "**
**నెమలి కిష్టమైన ఆహారం గురించి కోడిపెట్టకేం తెలుస్తుంది?**
నా మిత్రుడు డా. ఘనీకి ఇంత మాత్రం చెప్పగలనని అంటూ,
అతనిని క్షమించమని బాబాని వేడుకుంటున్నాను.
అతనేం మాట్లాడుతున్నాడో ఆయనకే మాత్రం తెలియదు.
కనుక క్షమించు బాబా అని వేడుకుంటున్నాను.
**(......all that I can do for him is to pray Baba to forgive him for, he knew not what he had said).**
ఈ సంవాదం విన్న మండలివారందరూ ఆనందంతో చప్పట్లు కొట్టారు.
ధాకే మంచి న్యాయవాది!
తన కేసును బాగా వాదించాడు
**Dhake is a lawyer and ably argued his case**
అని డా. ఘనీ అన్నాడు.
తనకు మహ్మద్ ఆలీ జిన్నా గుర్తుకొచ్చాడని రమ్జూ అబ్దుల్లా అన్నాడు.
ఇదొక చక్కని సంవాదం!!
వివాదం కాదు సుమీ !! !!!

ప్రస్తుతాంశం

# మెహెర్‌బాబా కార్యక్రమాలు



సుమారు 200 మంది తెలుగువాళ్ళు మెహెర్‌బాబా దర్శనార్థం పూణే వెళ్ళారు.

మెహెర్‌బాబా గురుప్రసాద్ బంగళాలో వున్నారు. బాబా అందరికీ తన చల్లని ఆలింగనం ఇచ్చారు. అందరూ బాబా సమక్షంలో కూర్చున్నారు. ముందుగా తెలుగునాట బాబా కార్యక్రమాలు ఎలా చేపట్టాలి? మెహెర్‌బాబా నామవ్యాప్తి ఎలా జరగాలి? అనే అంశంపై చర్చ మొదలయింది.

బాబా శిష్యుడు మరియు కార్యదర్శి శ్రీ ఆదీ.కె.ఇరానీ కూడా తెలుగువారితో పాటు వున్నారు.

ఈ సందర్భంగా బాబా తన సందేశంలో ...

తన కార్యక్రమాలు నిర్వహిస్తున్న కార్యకర్తలు, నిర్వాహకుల నడుమ కోపతాపాలుండరాదన్నారు.

వారి నడుమ ఈర్ష్య, అయిష్టతలాంటివి వుండరాదన్నారు.

అందరూ సమభావంతో ఐకమత్యంగా వుండాలని హితవు చెప్పారు.

మీరు పదిమందికి బాబా సందేశాల గురించి చెప్పబోయేముందు

మీరు ఆ సందేశాలను ఆచరిస్తూ అందరికీ ఆదర్శంగా వుండాలన్నారు.
అప్పుడే మీరు చేపట్టే కార్యక్రమాలు ఏవైనా విజయవంతమౌతాయన్నారు బాబా.
అలా వెళ్ళిన 200 మంది తెలుగు గ్రూపులో
ఒక గ్రూపు హెడ్‌తో నీతో అందరూ ఆనందంగా వున్నారా? అని బాబా ప్రశ్నించారు.
అతను బాబా ఎదుట అబద్ధం చెప్పలేదు కదా!
**'లేదు' బాబా.** అందరూ నాతో సంతోషంగాలేరని నిజం చెప్పాడు.

**"Hypocrisy spoils Baba's work!**

**Purity of heart and the feeling of oneness with others are required while working for Me"** అని బాబా అన్నారు.

కపటం వద్దు.
లోపల ఒకమాట బయటకొక మాట వద్దు.
పెదవులు పలకరిస్తాయి.
నొసలు వెక్కిరిస్తాయంటారే! అలాంటి హిపోక్రసీ పనులు
బాబా కార్యక్రమాలను విజయవంతం చేయవు.
అందరం ఒక్కటే! అనే భావంతో బాబా కార్యక్రమాలు చేపట్టాలని బాబా అన్నారు.
దాంతో సదరు గ్రూపు హెడ్, ప్రధాన కార్యనిర్వాహకుడు లేచి బాబాతో,
క్షమించు బాబా అని వేడుకున్నాడు.
ఇకపై అందరితో కలసిమెలసి పనిచేస్తానని వాగ్దానం చేస్తున్నానని ప్రకటించాడు.
తన తప్పు ఒప్పుకున్నందుకు చాలా సంతోషం అని బాబా అన్నారు.
ఇంతలో మరొక తెలుగు బాబా ప్రేమికుడు నిలబడి
నేను బాబా ఇచ్చిన ఆదేశాలు, సందేశాలను
తు.చ. **తప్పక పాటించడానికి తన శాయశక్తులా ప్రయత్నిస్తున్నానని అన్నాడు.**

**"I am Sincerely trying to follow Baba's orders.**

మెహెర్‌బాబా ఈ మాటల్ని ఇలా సరిదిద్దారు.

**Don't keep on saying,**
**"I am trying",**
**but do it and be it,**
**for you will become old before your time if you go on saying.**
**'I am trying'** and
there is no result.
Once you know the truth,
you must not merely try, but do it!!

Try once or twice,
but do not make **it a lifelong habbit."**
ఆ తర్వాత ప్రక్కనే వున్న తొలితరం బాబా మండలి సభ్యుడు
సదాశివపటేల్‌తో బాబా కార్యక్రమాలు ఎలా చేపట్టాలి? అని బాబా
ఆయన్ని ప్రశ్నించారు.
సదాశివపటేల్ తన అనుభవాలను రంగరించి క్లుప్తంగా ఇలా అన్నారు.
**పని ఎక్కువ - మాటలు తక్కువ లాగా,**
బాబా పనిలో సంపూర్ణంగా నిమగ్నమయిపోవాలి.
చిన్ని చిన్ని తగాదాల జోలికి పోయేటంత సమయం లేకుండా,
చేపట్టిన కార్యక్రమాలు నిర్విఘ్నంగా కొనసాగించాలి!! అని అన్నాడు.
మీరు నా సందేశాలు వల్లెవేయడం కాదు ప్రధానం.
మీరు చెప్పే నా సందేశాలను ముందుగా మీరు ఆచరించి,
ఆ దరిమిలా పలువురిచేత ఆచరింపజేసేలా కృషి చేయాలని బాబా చెప్పారు!!
ఇందుకు మీ మనస్సే ప్రధాన సాక్షి.
మీ హృదయమే న్యాయ నిర్ణేత కావాలి.
ఈ సమయంలో బాబా ఒక చిన్న సంఘటన చెప్పారు.

## ఖర్జూరాలు

మహ్మద్ ప్రవక్త కాలం నాటి సంఘటన ఇది.
**ఖర్జూరాలంటే** ప్రవక్తకు మహా ఇష్టం.
ఒక రోజున ఒక తల్లీ పిల్లవాడు మహ్మద్ దగ్గరకు వచ్చారు.
ఆ పిల్లవాడు ప్రతిరోజు ఖర్జూరాలను ఇష్టమొచ్చినట్లు తింటున్నాడు.
అలా తింటుంటే ఆరోగ్యం దెబ్బతింటుందన్నా పిల్లవాడు వినడు.
సరికదా... అజీర్ణం, విరోచనాలతో బాధపడుతున్నాడు.
ఆ పిల్లవాడు తల్లితండ్రుల మాటను ఖాతరు చేయడం లేదు.
మీదు మిక్కిలి మీరు కాదు నాకు చెప్పేది,
ప్రవక్త కనుక ఖర్జూరాలు తినొద్దని చెబితే తాను తినడం మానేస్తానన్నాడు.
అలా వచ్చిన పిల్లవాడు, అతని తల్లితండ్రులతో మహ్మద్ ఏమీ మాట్లాడలేదు.
**ఎందుకంటే ప్రవక్తకు కూడా ఖర్జూరాలంటే ఎంతో ఇష్టం.**
**ఆయన కూడా ఎలాలేదన్నా రోజూ ఎక్కువగానే తింటుంటాడు.**
అందుకని ఆ పిల్లవానికి తినమని కానీ,
వద్దని కానీ స్పష్టంగా ఏమీ చెప్పలేదు.

కానీ ఓ పక్షం రోజుల తర్వాత తిరిగి రమ్మనమని పంపివేశాడు.

ఈ సమయంలో మహ్మద్ ఖర్జూరాలు తినడం పూర్తిగా మానివేశాడు.

ఆ దరిమిలా తిరిగి పిల్లవానితో వచ్చిన తల్లితండ్రులతో ఖర్జూరాలను

అమితంగా తినొద్దని, ఆరోగ్యం పాడౌతుందని,

జాగ్రత్త సుమీ అని పిల్లవానికి సూచించాడు.

ఈ మాటలను ఆ పిల్లవాడు మహ్మద్ ఆదేశాలుగా అమలు చేశాడు,

అని బాబా చెబుతూ

If you tell others not to tell lies,

then even at the cost of your life,

you should not tell a lie.

Otherwise it would amount to hypocrisy అన్నారు.

నా కార్యకర్తలందరూ నూటికి నూరుపాళ్ళు నిజాయతీగా, అందరూ ఐకమత్యంగా వుండి నా కార్యక్రమాలు చేపట్టాలి.

Both the parties must give in only then will there be no trouble in Baba work అన్నారు.

వయస్సులో పెద్దవాడైన మరో ప్రేమికుడు లేచి నిలబడి,

బాబా నాకొక మోటారు కారు ఇప్పిస్తే

నీ నామవ్యాప్తిని గ్రామ గ్రామాన చేపట్టడం సులువవుతుందన్నాడు.

మోటారు కారు ఎవరు కొనివ్వాలి? అని అడిగారు బాబా.

కారు కొనుగోలుకయ్యే ఖర్చు బాబా ప్రేమికుల నుండి విరాళాలు సేకరిస్తాం అని జవాబు ఇచ్చాడాయన.

తన పేర విరాళాల సేకరణకు బాబా అంగీకరించ లేదు.

మోటారు వ్యాను లేకపోతే ఎద్దుల బండి మీదనో

లేదా కాలి నడకనో వెళ్ళాలి కానీ

నా నామవ్యాప్తి కోసం విరాళాలు సేకరణ చేపట్టవద్దని బాబా హెచ్చరించారు.

కోపతాపాలకు ఈర్ష్యా ద్వేషాలకు తావివ్వకుండా

నిజాయతీగా నా కార్యక్రమాలు నిర్వహించండి.

మీ అభిప్రాయంగా మరొకరికి చెప్పవల్సివస్తే

సూటిగా, నిర్మొహమాటంగా ఆయా వ్యక్తి ఎదుటనే చెప్పండి.

అంతేకానీ, ఆ మనిషి వెనకాల గుస గుసలాడ వద్దని బాబా హెచ్చరించారు.

❀

# ఇది కథ కాదు.. ఐనప్పటికీ..,

కొంతమంది భగవంతునికి ప్రార్థన చేయడానికై నిలబడి ఆకాశం కేసి పైపైకి చూస్తుంటారు.
ఆకాశంలో ఏముంది? ఏమీ లేదు.
భగవంతుడు నీ హృదయంలో పదిలంగా వున్నాడు.
హృదయంతో ఆ దేవదేవుడిని ఆరాధించండి!
ప్రార్థించండి అన్నారు బాబా !!
దేవుడిని ప్రార్థించే సమయంలో
మీ హృదయాలలో ఎలాంటి ఆలోచనలకు తావివ్వొద్దు.
ఒక రోజున బాబా తన దగ్గరగా వున్నవారిని దేవుడిని ప్రార్థించమనగానే –
ఓ భగవంతుడా...నీ దయతో నాకు మంచి ఆరోగ్యం ప్రసాదించు.
మంచి జీవితాన్ని ప్రసాదించు స్వామీ అంటూ
తన కోర్కెల చిట్టా తన ప్రార్థనలో చొప్పించాడో భక్తుడు.

**"O god – grant me health, give me long life,**
**so that I may serve thee ......."**

ఇది ప్రార్థన అవుతుందా? అని బాబా ప్రశ్నిస్తూ....
ఎలాంటి కోర్కెలు కోరకుండా, ప్రార్థనా సమయంలో భగవంతుని నామాన్ని స్తుతించాలి.
భక్తుడు భగవన్నామ స్మరణలో తరించాలి.
మీరు చూస్తున్న ఈ ప్రపంచం నిజం కాదని,
ఇదంతా మిధ్య అని తెలుసుకున్నాక కూడా....
ఇంకా అది కావాలి..ఇది కావాలని కోరుకోవడంలో అర్థమేమైనా వుందా? అని బాబా ప్రశ్నించారు.

**"THE REAL PRAYER TO GOD IS PRAISE FOR HIM THROUGH LOVE AND NOTHING ELSE. WHEN YOU KNOW YOU ARE IN ILLUSION, WHY KEEP ASKING FOR MORE OF IT?"** ఈ విషయంలో ఒక చక్కని కథను బాబా తన మండలి ప్రేమికుని ద్వారా చదివి చెప్పమని సూచించారు.

ఆ కథ ఇలా వుంది.
మన నిత్యజీవితంలో ఇలాంటి వ్యక్తులు మనలో చాలామందికి తారసపడతారు కూడా...
బాబా ప్రేమికులుగా ఈ కథను నిశితంగా పరిశీలించండి.
ఈ కథకు ముగింపు మీరు చెబితేనే బాగుంటుంది.
ముగింపు మేం ప్రస్తావించడం లేదు. గమనించండి...

## బిక్షగాడు

అనగనగా ఒక ఊరు.

ఆ ఊరిలో ఒక బిక్షగాడు ఉన్నాడు.

స్థానికంగా ఊర్లో వున్న దేవుని గుడి ఎదురుగా కూర్చునేవాడు.

భక్తులు అడపాదడపా వేసే ప్రతిపైసా భిక్షనీ తన జీవనం కోసం కూడబెట్టేవాడు.

కొద్ది రోజులయ్యే సరికి ఆ పైసలు అన్నీ కలిపితే నూరు పైసలయ్యాయి.

ఆ పైసలన్నింటినీ కలిపి ఒక వెండి నాణెం కొనుగోలు చేశాడు.

ఇలా పైసాపైసా కూడపెడుతూ 25 వెండి నాణేలు కూడబెట్టేసరికి వృధాప్యం వచ్చేసింది.

ఇక తానెంత కాలమో బ్రతకననే విషయం అతనికి తెలిసిపోయింది.

ఇలా కష్టపడి కూడబెట్టిన వెండి నాణేలను ఎలా బధ్రపరచాలా?

అనే ఆలోచనలో పడ్డాడు.

తన జీవితాంతం కష్టించి సంపాదించిన ఆ నాణేలను

ఎవరికీ ధారాదత్తం చేయడం అతనికి ఏ మాత్రం ఇష్టంగా లేదు.

ఆ నాణేలు తన మరణానంతరం ఎవ్వరికీ చెందరాదనే నిశ్చయించుకున్నాడు.

తన చొక్కా జేబుల్లో వుంచుకుని మరణిస్తే

ఎవరైనా దొంగిలించే అవకాశం వుందని,

తాను బ్రతికుండగానే ఆ నాణేలన్నింటినీ మ్రింగేసి,

తన శరీరంలోనే ఎవరికీ తెలియకుండా బధ్రపరచాలనుకున్నాడు.

అలా చేయడం వల్ల తన మరణానంతరం కూడా తన జీవితకాలంలో సంపాదించిన నాణేలు తనతోపాటే వుండిపోతాయని ఆలోచించాడు.

ఆ ఆలోచన వచ్చిందే తడవుగా

ఆ వెండి నాణేలను ఒకదానిపై ఒకటి వుంచి

వాటన్నింటినీ ఒక్క గుటకలో మింగేయాలని ప్రయత్నించాడు.

**ఆ ప్రయత్నం వికటించింది.**

ఆ నాణేలన్నీ ఒక్కసారిగా మింగలేక,

శక్తి నశించి, ఊపిరాడక ప్రాణాలొదిలేశాడు, ఆ ముసలి బిక్షగాడు!!

ఏమైతేనేమి!

బిక్షగాడు ఆశించినట్లు అతను సంపాదించిన నాణేలు ఏవీ ఎవ్వరికీ చిక్కకుండా,

తన దేహంలోనే వుంచుకుని శరీరాన్ని చాలించాడు.

ఇంతవరకూ బాగానే వుంది.

ఆ అనాధ శవాన్ని స్థానిక మునిసిపాలిటీ వాళ్ళు ఖననం చేసారు.

తూతూమంత్రంగా ఆ అంత్యక్రియలు జరిగాయి.

చనిపోయిన ఆ కళేబరాన్ని అనేక జంతువులు తమ ఇష్టమొచ్చినట్లు పీక్కుతిన్నాయి.
శరీరంలోని మాంసాన్ని ఆరగించేసాయి.
తల భాగం 'పుర్రెతో పాటు, శరీరంలోని ఎముకలన్నీ చెల్లాచెదరైనాయి.
ఒక రోజున ఆ దారి వెంబడి వెళ్ళే స్కూలు పిల్లల కాలికి
ఎముకల గూడులాగా వున్న ఆ బిక్షగాని పుర్రె వారి కాలికి తగిలి
గలగలా చప్పుడు చేసింది. ఆ చప్పుడు పిల్లల్ని ఎంతగానో ఆకర్షించింది.
చాలాసేపు ఆనందంగా ఆ పుర్రెతో ఆడుకుని,
పుర్రెలోపల చేస్తున్న గలగలను బయటకు తీయాలని పెద్ద బండరాళ్ళతో కొట్టారు.
ఆ గలగల చప్పుడుకు కారణం ఆ వృద్ధుడు చనిపోతూ మింగిన
నాణేలు కడుపులోకి పోలేదు. నోటి భాగంలోనే పళ్ళ బిగువున వుండిపోయాయి.
పిల్లలూ ..స్థానిక పెద్దలూ అందరూ కలిసి ఆ పుర్రెను బ్రద్దలు కొట్టి,
ఆ వెండి నాణేలను తమ హస్తగతం చేసుకున్నారు.
**అదండీ సంగతి !!**
ఈ కథకు ఒకింత అటూ ఇటూగానే
మనలో చాలామందిమి ఉన్నారా ?
ఏమో ??
మీ స్పందన ప్రచురణార్థం పంపగలరు!!

# తేలు కాటు

మానవులు తప్పులు చేస్తుంటారు. ఆపై సంస్కారాల వలయంలో చిక్కుకుంటారు. తప్పులు చేయడం మానవ సహజం. ఇది కదా మనకు తెలిసింది.

తేలు కుడితే సుమారు 24 గంటలు నరక బాధ భరించాల్సిందే.

ఐతే, చేసిన పాపాలు, తప్పులు మాత్రం చాలాభాగం తేలుకాటుతో హరించబడతాయని బాబా చెప్పారు. తేలు కుట్టిన బాధలో ఆ నొప్పి తట్టుకునేందుకు హృదయాంతరాళ్ళ నుండి భగవంతుడిని ప్రార్థిస్తారు.

అందుకే చెడు సంస్కారాల నిర్మూలన జరుగుతుందని బాబా పేర్కొన్నారు. చెడు సంస్కారాల నిర్మూలనకు తేలు కాటు ఓ చక్కని దివ్యౌషధం.

ఐతే, తేలు కాటు యాదృచ్ఛికంగా, అకస్మాత్తుగా జరిగితేనే ఇది సాధ్యం. సంస్కారాల నిర్మూలనకై తెలు కాటు బారినపడేలా ప్రయత్నించడం వల్ల ఎలాంటి లాభముండదని బాబా హెచ్చరించారు.

**గ్రోయింగ్ విత్ గాడ్** గ్రంథంలో పే. **92** నుండి సేకరించడమైంది.

# గుర్తుంచుకోండి!!

మనకు తెలిసిన వారు మరణించినప్పుడు వారిని చూడ్డానికి వెళ్తుంటాం.

అలా వెళ్ళినప్పుడు ఆ చనిపోయిన వక్తిని తాకవద్దు అని మెహెర్‌బాబా హెచ్చరించారు.

ఎందుకంటే, ఆ సమయంలో చనిపోయిన వ్యక్తి నుండి అనేక వేల సంఖ్యలో సంస్కారాలు ఆతని దేహం నుండి బయటకువస్తాయి.

అందుకనే పార్శీలు ఏం చేస్తారంటే చనిపోయిన వ్యక్తి పార్థివ శరీరం మొత్తానికి పెరుగును ఒక పూతలా రాసి ఒక కుక్కను తీసుకొస్తారు.

ఆ కుక్క ఆ పెరుగునంతటినీ నాకుతుంది.

ఆ మాదిరిగా చనిపోయినవాని సంస్కారాలు చాలా భాగం కాలభైరవుడు తీసుకుపోయేలా పార్శీలు ప్రయత్నిస్తారని బాబా వివరించారు.

ఐతే, ఈ విషయంలో బాబా తన మండలి సభ్యులకు వర్తించదని బాబా స్పష్టం చేశారు.

మెహెర్‌బాబా ట్రస్టు చైర్మన్ భావూజీ కుమార్తె శ్రీమతి షీలా ఫెన్‌స్టర్ రాసిన గ్రంధం **గ్రోయింగ్ విత్ గాడ్** గ్రంధంలో పే.84లో ఈ విషయాలు ఉటంకించారు.

## పాములతో జాగ్రత్త

ఇదే గ్రంధంలో మరో ఆసక్తికర విషయం బాబా ఆమెతో చెప్పారని షీలా ప్రస్తావించింది.

అదేమంటే ఆ రోజుల్లో మెహెరాబాద్‌లో పాములు లెక్కకు మిక్కిలిగా మానవులతో సమానంగా తిరుగుతున్నాయా? అన్న చందంగా వుంది.

ఆమె కొన్ని వేల త్రాచుపాములు చూసానని ఆ రచనలో పేర్కొంది.

అంతేకాదు ఒక రోజున ఓ చెట్టు క్రింద నిల్చునుంటే ఆ చెట్టు పైనుండి ఒక త్రాచు తన తలపై పడి అక్కడి నుండి ప్రాక్కుంటూ పోయింది. అదృష్టవశాత్తూ తనను కాటేయలేదని ఆమె అన్నారు.

ఆ తర్వాత బాబాతో ఆ జరిగిన విషయం చెబితే...పాము కాటు పడకుండా వుండేందుకు ఎప్పుడూ బూట్లు వేసుకోమని బాబా సలహా ఇచ్చారు.

పాముని మానవులు చంపితే తిరిగి వాటికి పరిణామక్రమంలో మానవజన్మ లభిస్తుందని బాబా ప్రకటించారు.

అదే మరో జంతువు బారిన పడి పాము చంపబడితే తిరిగి పాముగానో లేదా మరో జంతురూపమో లభిస్తుందని బాబా అన్నారు.

ఆ మాదిరిగా పాము నుండి మానవులుగా జన్మఎత్తిన వారు చాలా కోపిష్టిగా వుంటారన్నారు. చిన్న విషయానికే చిర్రెత్తిపోయి చిందులేస్తారని అవతారుడు తెలియజేశారు.

# ప్రభుస్తుతి

## ప్రభుస్తుతి

ఓ పర్వర్దిగార్,
సర్వపోషకా! సర్వ రక్షకా!
నీవు ఆదియును
అంతమును లేని వాడవు,
అద్వయుడవు,
నిరుపమానుడవు,
నీ ప్రమాణమెవ్వరును
ఎరుంగనేరరు
నీవు వర్ణము,
నామము,
రూపము,
గుణములు లేని వాడవు.
నీవు అపరిమితుడవు
గంభీరుడవు,
ఊహాతీతుడవు,
భావనాతీతుడవు,
శాశ్వతుడవు
నాశనము లేని వాడవు.
నీవు అవిభాజ్యుడవు,
దివ్యచక్షువులతో గాని
నిన్నెవరును చూడజాలరు
నీవు ఎల్లప్పుడు నుంటివి,
నీవు ఎల్లప్పుడు నున్నావు
నీవు ఎల్లప్పుడు నుందువు
నీవు అంతటను గలవు,
నీవు అన్నింట నున్నావు.
మరి నీవు అంతటికి
అన్నింటికి
ఆవలనుందువు.
నీవు ఆకాశమును గలవు
పాతాళమున గలవు
నీవు వ్యక్తుడవు
అవ్యక్తుడవు,
అన్ని భూమికలందున్నావు,
అన్ని భూమికల కతీతుడవు.
నీవు మూడు
లోకాలలోనున్నావు
ముల్లోకాల కావలగూడ నున్నావు.
నీవు అగోచరుడవు,
స్వతంత్రుడవు.
నీవు సృష్టికర్తవు,
ప్రభువులకు ప్రభుడవు,
అందరి మనస్సులను
హృదయములను
ఎరిగిన వాడవు,
నీవు సర్వశక్తిమంతుడవు,
సర్వవ్యాపివి,
నీవే అనంతజ్ఞానము,
అనంత శక్తియు,
అనంత ఆనందమును.
నీవు జ్ఞానసాగరుడవు,
సర్వజ్ఞుడవు,
అనంత జ్ఞానివి,
త్రికాల వేదివి,
జ్ఞానమే నీవు,
నీవు సర్వదయాళుడవు,
నిత్య శుభంకరుడవు,
నీవు ఆత్మలకెల్ల నాత్మవు
అనంతగుణ విశిష్టుడవు,
నీవు సత్య, జ్ఞాన
ఆనందముల
త్రిమూర్తివి,
నీవే సత్యమునకు
మూలము,
ప్రేమ మహాసాగరుడవు,
నీవు పురాణ పురుషుడవు,
సర్వోత్తముడవు,
నీవు ప్రభుడవు,
పరమేశ్వరుడవు,
నీవు పరుడవు,
పరాత్పరుడవు,
నీవు పరబ్రహ్మవు,
అల్లాహ్,
ఇలాహీ,
యజ్‌దాన్,
అహురమజ్ దా,
ప్రియతముడైన
భగవంతుడవు,
నీవు 'ఈజద్' అనబడు
ఏకైక పూజ్యుడవు.

# పశ్చాత్తాప ప్రార్థన

**ఓం పరబ్రహ్మ - పరమాత్మా**
**యా - యాజ్దాన్**
**లా ఇలాహ్ ఇల్లిల్లాహ్**
**ఓ గాడ్ ఫాదర్ ఇన్ హెవెన్**
**ప**రమ దయానిధివగు ఓ ఈశ్వరా!
మా పాపములన్నిటికిని
మేము పశ్చాత్తాప పడుచున్నాము
అసత్యము, అధర్మము,
అపవిత్రమును అగు
మా ప్రతి తలంపునకును,
పశ్చాత్తాప పడుచున్నాము.
పలికి యుండరాని పలికిన
ప్రతి మాటకును,
చేసి యుండరాని చేసిన
ప్రతి చేతకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
స్వార్థముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని, ప్రతి మాటకును
ప్రతి తలంపునకు,
ద్వేషముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని,
ప్రతి మాటకును
ప్రతి తలంపునకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ ముఖ్యంగా,
కామముతో కూడిన
మా ప్రతి తలంపునకును
కామ ప్రేరితమగు
మా ప్రతి చేతకును
పలికిన ప్రతి అనృతమునకును,
సమస్త కపటవర్తనమునకును,
ఆడి తప్పిన
ప్రతి వాగ్దానమునకును,
సమస్త పరనిందలకు,
పరోక్ష నిందలకు,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ, ముఖ్యముగా కూడా,
పరులకు నాశన మొనగూర్చునట్టి
మేము చేసిన ప్రతి పనికిని,
ఇతరులకు బాధ కలుగజేసినట్లు
మేమాడిన ప్రతి మాటకును,
చేసిన ప్రతి చేతకును,
ఇతరులకు బాధ కలుగవలెనని
మేము కోరిన ప్రతి కోర్కెకును,
మిక్కిలి పశ్చాత్తాపపడుచున్నాము.
నీ యొక్క అపార దయతో ఓ ఈశ్వరా!
మేము చేసిన
ఈ పాపములన్నిటిని
క్షమింప వేడుకొనుచున్నాము.
తలపులలో కాని, మాటలలో కాని
చేతలలో కాని
నీ ఇచ్ఛానుసారము నడుచుకొన జాలక
నిరంతరము విఫలులమగుచున్న
మమ్ములనందరిని క్షమింప
వేడుకొనుచున్నాము.

# మండలి ప్రార్థన

ప్రియ దైవమా!

నిన్ను అధికాధికముగా ప్రేమించునట్లును, ఇంకను అధికముగా నీతో ఐక్యమగునంతటి అర్హతగల వారమగునంతవరకును నిన్నింకను అధికముగ ప్రేమించునటుల మాకందరకు సహాయము చేయుము. మరియు బాబా కొంగును చిట్టచివరి వరకు దృఢముగా పట్టుకొని ఉండుటకై మాకందరకు సహాయము చేయుము.

# జీవిత సభ్యతం

**2012 మార్చి-ఏప్రిల్ నెలలో పంపిన వారి వివరాలు**

| నెం. | | పేరు, ప్రాంతము | చెల్లించిన సొమ్ము |
|---|---|---|---|
| 1. | ఏప్రిల్ | టి. జ్ఞానేశ్వర్, నారాయణపురం | రూ. 1000.00 |
| 2. | ఏప్రిల్ | జి. ప్రకాష్, హైదరాబాద్ | రూ. 1000.00 |
| 3. | ఏప్రిల్ | డి. కిషోర్ కుమార్, ఖమ్మం | రూ. 500.00 |
| 4. | ఏప్రిల్ | ఎల్. వెంకటేశ్వరరావు, ఖమ్మం | రూ. 1000.00 |
| 5. | ఏప్రిల్ | డి.జి.ఎన్. ప్రసాద్ రెడ్డి, జ.గూడెం | రూ. 500.00 |
| 6. | ఏప్రిల్ | బి. అప్పలస్వామి, పార్వతీపురం | రూ. 1000.00 |
| 7. | ఏప్రిల్ | డి.జి.ఎన్. ప్రసాద్ రెడ్డి, జ.గూడెం | రూ. 500.00 |
| 8. | ఏప్రిల్ | మురళీమోహన్, చీపురుపల్లి | రూ. 500.00 |
| | | **మొత్తం** | రూ. **6000.00** |

# పత్రిక సభ్యత్వం

1. మెహెర్‌బాబా పత్రిక జీవిత సభ్యత్వం రూ. 1000/- (వెయ్యి రూపాయలు). 2. రెండు దఫాలుగా కూడా రూ.500/- చొప్పున చెల్లించవచ్చు. 3. జీవిత సభ్యత్వం చెల్లింపులపై వచ్చే వడ్డీని మాత్రమే పత్రిక నిర్వహణా ఖర్చులకు వినియోగించాలి. అయితే నేటి వరకు జీవిత సభ్యత్వంపై వచ్చిన వడ్డీని కూడా అసలు మొత్తానికే జమచేయడమైనది. 4. వార్షిక సభ్యత్వం రూ.100/- పోస్టల్ మనీ ఆర్డర్ ద్వారా పంపవలిసింది. 5. బ్యాంకు డ్రాఫ్టు లేదా బ్యాంకు చెక్కు ద్వారా పంపగోరు వారు శ్రీమతి నిర్మలాదేవి, హైదరాబాద్ పేరున పంపగలరు.

**మా అడ్రస్: ఎడిటర్, మెహెర్‌బాబా, గోదావరి గార్డెన్స్, బాబాస్ హౌస్, యాప్రాల్, ప్లాట్ నెం.32, జె.జె. నగర్ కాలనీ, సికింద్రాబాద్-500087. ఫోన్:99595-53218, email: malladisukku@gmail.com**

Printed and published and owned by Dasika Nirmaladevi printed at Sai Srinivasa Printers, Khairatabad, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad.

**Editor: D.Nirmaladevi**

RNI No. APTEL/2002/7310, Postal Concession: R&D/RNP/HSE/789/2012-2014, **Dt.19-12-2011**